


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక                ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 147 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ ఆదివారం 1 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE : 147 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SUN 1 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



### విశాఖలో చంద్రబాబు కుటుంబం

## రూ.5 వేల కోట్ల విలువైన భూములను లాగేసుకుంది

- అధికార దుర్వినియోగంతో ఎంపీ భరత్‌కు రుషికొండ భూములు కట్టబెట్టారన్న జగన్
- జీవీఎంసీలో వైసీపీ కార్పొరేటర్లపై దాడులు చేసి తీర్మానం నెగ్గించుకున్నారని ఆరోపణ
- చంద్రబాబు, లోకేష్ పాలనను రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మార్చేశారని విమర్శ
- బీసీ మహిళా మేయర్‌ను తొలగించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఆగ్రహం

మిగతా2లో




# అంబటి ఇంటి వద్ద హై టెన్షన్..

## అద్దాలు, కారు ధ్వంసం.. టీడీపీ శ్రేణుల దాడి

- అంబటి ఇంటిని ముట్టడించిన టీడీపీ శ్రేణులు... చేతులు జోడించి క్షమాపణ చెప్పాలన్న ఎమ్మెల్యే గల్లా మాధవి
- ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యల కలకలం
- అంబటి రాంబాబు నివాసాన్ని ముట్టడించిన టీడీపీ శ్రేణులు
- చేతులు జోడించి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే గల్లా మాధవి డిమాండ్
- అంబటి ఇంటిపై రాళ్లు, కోడిగుడ్ల దాడి.. కారు ధ్వంసం
- ఆయన్ను అరెస్ట్ చేయాలంటూ మహిళా కార్యకర్తల ఆగ్రహం

**పెన్ పవర్ డెస్క్:**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై తీవ్ర అసభ్య పదజాలంతో వ్యాఖ్యలు చేశారంటూ వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుపై తెలుగుదేశం పార్టీ శ్రేణులు భగ్గుమన్నాయి. అంబటి బహిరంగంగా, రెండు చేతులు జోడించి క్షమాపణ చెప్పాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి డిమాండ్ చేశారు. ఆమె నేతృత్వంలో వందలాది మంది టీడీపీ కార్యకర్తలు, మహిళలు గుంటూరు నవభారత్ నగర్‌లోని అంబటి నివాసాన్ని ముట్టడించారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. గల్లా మాధవి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో తరలివచ్చిన టీడీపీ కార్యకర్తలు అంబటి నివాసం వద్దకు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఆయనకు

మిగతా2లో

### సీఎం చంద్రబాబుపై అంబటి రాంబాబు తీవ్ర అసభ్య వ్యాఖ్యలు

- గుంటూరు ఎస్పీకి ఫిర్యాదు చేసిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యాలరావు
- లడ్డూ నెయ్యి కల్తీ ఫ్లెక్సీపై మొదలైన వివాదం
- గోరంట్లలో అంబటిని అడ్డుకున్న టీడీపీ శ్రేణులు
- అంబటి వ్యాఖ్యలు అత్యంత దుర్మార్గమన్న మంత్రి పార్థసారథి



## గగన్‌యాన్ కోసం 8 వేలకు పైగా ప్రయోగాలు

- వ్యోమగాముల భద్రత దృష్ట్యా మానవరహిత రాకెట్ల ప్రయోగం
- మొదటి ప్రయోగం మార్చిలో చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడి
- రాకెట్‌లోని ప్రతి వ్యవస్థను పరిశీలిస్తున్నామన్న ఇస్రో ఛైర్మన్

తొలి మానవరహిత అంతరిక్ష ప్రయాణ మిషన్ 'గగన్‌యాన్'కు సిద్ధమవుతున్నామని భారత అంత రిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఛైర్మన్ నారాయణన్ తెలిపారు. క్షేత్రస్థాయిలో నిర్వహించిన

మిగతా2లో



## భారత్ పై ట్రంప్ 50 శాతం సుంకాలు...

### అమెరికా రిటైర్డ్ అధికారి కీలక వ్యాఖ్యలు

- సొంత ప్రయోజనాలకు రాజీపడి ఏ దేశం కూడా ఇతర దేశాలతో చర్చలు జరపబోదని వ్యాఖ్య
- 50 శాతం సుంకాలు విధించడం ట్రంప్ మూర్ఖత్వపు మనస్తత్వానికి నిదర్శనమని ఆగ్రహం

## ఇ-సైకిళ్లపై భారీ రాయితీ..

### గిన్నిస్ రికార్డుతో ఏపీ సర్కార్ కొత్త చరిత్ర

- ఏపీలో ఇ-సైకిళ్లపై రూ.10 వేల రాయితీ ప్రకటించిన ప్రభుత్వం
- 24 గంటల్లో 5,555 సైకిళ్లు పంపిణీ చేసి గిన్నిస్ రికార్డు
- కుప్పంలో 3 కిలోమీటర్లు ఇ-సైకిల్ నడిపిన సీఎం చంద్రబాబు
- రూ.35 వేల సైకిల్‌ను రూ.25 వేలకే పొందే అవకాశం
- ఇ-మోటరాడ్ సంస్థతో ఒప్పందం.. కుప్పంలోనే అసెంబ్లింగ్

మిగతా2లో



### బలూచిస్తాన్‌లో రెచ్చిపోయిన

# వేర్పాటువాదులు

### 10 మంది సైనికులతో సహా 37 మంది ఉగ్రవాదులు మృతి..



**పెన్ పవర్ డెస్క్:**పాకిస్థాన్‌లోని బలూచిస్తాన్లో శనివారం వేర్పాటు వాదులు ఒక్కసారిగా రెచ్చిపోయారు. పలు జిల్లాల్లో ప్లాన్ ప్రకారం జరిపిన ఈ దాడుల్లో 10 మంది పాకిస్థాన్ భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోగా, ఎదురుకాల్పుల్లో 37 మంది ఉగ్రవాదులు హతమయ్యారు.ఏం జరిగిందంటే...బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) అనే నిషేధిత సంస్థ ఈ దాడులు జరిపింది. దీనిని 'ఆపరేషన్ హెరోఫ్' లో రెండో దశగా

మిగతా2లో




## ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు

- కుప్పం నియోజకవర్గంలో రెండో రోజు పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు
- బెగ్గిపల్లె గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పింఛన్ల పంపిణీ
- లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు విచారణ
- పథకాల అమలు తీరుపై స్వయంగా ఆరా తీసిన ముఖ్యమంత్రి
- ముగ్గురు లబ్ధిదారులకు తన చేతుల మీదుగా పింఛన్లు అందజేత

మిగతా2లో

## కల్తీ నెయ్యి వ్యవహారంలో వైసీపీ గుట్టురట్టు... ఇవిగో ఆధారాలు

- టీటీడీ నెయ్యి కల్తీకి వైసీపీ ప్రభుత్వమే కారణమన్న పయ్యావుల
- 2022లోనే కల్తీపై సీఎఫ్‌టీఆర్ఐ నివేదిక ఇచ్చినా తొక్కిపెట్టారని ఆరోపణ
- నెయ్యిలో జంతువుల కొవ్వు ఉన్నట్లు ఎన్డీడీబీ రిపోర్ట్ నిర్ధారించిందని వెల్లడి
- దోషులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టీకరణ



**పెన్ పవర్ డెస్క్:**తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారన్న ఆరోపణలపై ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సంచలన విషయాలు వెల్లడించారు. ఈ కల్తీ వ్యవహారానికి పునాది వేసింది గత వైసీపీ ప్రభుత్వమేనని, ఇందుకు సంబంధించిన స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని ఆయన తెలిపారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండించారు.

మిగతా2లో



# అంబటి ఇంటి వద్ద హై టెన్షన్..

వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆగ్రహంతో ఉన్న కొందరు కార్యకర్తలు అంబటి ఇంటిపై రాళ్లు రువ్వగా, మరికొందరు ఇంటి బయటన ఉన్న కారును ధ్వంసం చేశారు. టీడీపీ కార్యకర్తల దాడుల్లో ఇంటి కిటికీ అద్దాలు, పూలకుండీలు పగిలిపోయాయి. టీడీపీ మహిళా కార్యకర్తలు చీపురు కట్టలతో నిరసన తెలుపుతూ, అంబటి నివాసంపై కోడిగుడ్లు విసిరారు.ః ఈ సందర్భంగా ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తిని ఇంతటి అసభ్యకరంగా దూషించడం హేయమైన చర్య. అంబటి రాంబాబు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, ప్రజలందరి ముందు చేతులు జోడించి క్షమాపణ చెప్పాలి" అని డిమాండ్ చేశారు.మహిళా కార్యకర్తలు సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "చంద్రబాబు మాకు దైవంతో సమానం. గతంలో ఆయన కుటుంబసభ్యులను దూషించినప్పుడు సంయమనం పాటించాం. కానీ ఈసారి సహించేది లేదు. అంబటి రాంబాబును వెంటనే అరెస్ట్ చేయాలి, లేదంటే మాకు అప్పగించాలి" అంటూ వారు పోలీసులను డిమాండ్ చేశారు. ఈ ఆందోళనతో అంబటి నివాసం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## ఎడిటర్ వ్యూ

### సాహితీ వటవృక్షం జువ్వాడి గౌతమరావు

ఆయన ఒక సాహితీ వటవృక్షం. స్వయంగా కవి మాత్రమే కాకుండా, ఎందరో సాహితీ వేత్తలకు ఆశ్రయ దాత. దివంగత ప్రధాని పీ.వి. నరసింహా రావు, కాళోజీ నారాయణరావు, కోవెల సుప్రసన్న, సంపత్ కుమార ఆచార్య, సామల సదాశివ లాంటి సాహితీ దురంధరులతో సాన్నిహిత్యం కలిగి ఉన్నవారు. ప్రధానంగా కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణతో ఆయనకు గల అనుబంధం, విశ్వనాథను కరీంనగర్ రప్పించి, అక్కడి డిగ్రీ కళాశాల ప్రాచార్యునిగా విధులు నిర్వహించేలా చేసింది. తద్వారా ఉత్తర తెలంగాణకు చెందిన సాహితీవేత్తల సంగమానికి వేదికను ఏర్పరచి, సాహిత్య సుసంపన్నానికి కార్య క్షేత్రాన్ని సిద్ధం చేసింది. ఇలా కరీంనగర్‌లో సాహితీ సౌరభాలు గుబాలించ డానికి అహరహం శ్రమించిన సాహితీ ప్రియుడు జువ్వాడి గౌతమరావు. గౌతమ రావు సాహితీవేత్తనే కాకుండా, స్వాతంత్ర్య పోరాటంలో యోధుడు. సోషలిస్టు భావాలను జీర్ణించుకున్న వ్యక్తి. ఔరంగాబాద్ జైలు గోడలను ఛేదించుకొని వచ్చిన ధైర్యశాలి. పార్టీ పక్షాన 1977లో పోటీ చేసి ఓటమి చెందాడు. జువ్వాడి గౌతమరావు (ఫిబ్రవరి 1, 1929 – 2012) కరీంనగర్ మండలం ఇరుకుళ్ళ గ్రామంలో 1929, ఫిబ్రవరి 1 న జువ్వాడి గౌతమరావు జన్మించాడు. కరీంనగర్‌లో విద్యాభ్యాసం సాగించాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీఏ ఎల్‌ఎల్‌బీ పట్టా పుచ్చుకున్నాడు. పీవీ నరసింహారావు, కోవెల సుప్రసన్నాచార్య, కోవెల సంపత్కుమారాచార్య వంటి సాహితీ మిత్రులతో ఆయనకు చాలా సాన్నిహిత్యం ఉన్నది. కరీంనగర్ సాహిత్య చైతన్య కేంద్రంగా భాసిల్లడంలో గౌతంరావు పాత్ర అసామాన్యం, అద్వితీయం. కరీంనగర్‌లో తెనుగు ఉనికిని కాపాడుతూ, అనేక కవితా గోష్ఠులలో పాల్గొంటూ నిరంతర సాహిత్య సేవ చేసిన భాషాభిమాని జువ్వాడి. ఆధునిక కాలంలో అడుగంటి పోతున్న సంప్రదాయ కవితా పరిరక్షణ కోసం పాటు పడ్డాడు. వరంగల్‌లో కాళోజీ, ఆదిలాబాదులో సామల సదాశివ మాదిరిగా కరీంనగర్‌లో జువ్వాడి గౌతంరావు సాహితీ వటవృక్షంగా వేలాది మంది సాహితీ కారులకు ఆశ్రయ మిచ్చాడు. ప్రగతి గామిగా ఉంటూనే విశ్వనాథ రామాయణ కల్పవృక్షానికి, విశ్వనాథకు భక్తుడిగా మారాడు. ప్రేమతో విశ్వనాథుని తన హృదయంలో దాచుకొన్నాడు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణకు జువ్వాడి అత్యంత ఆత్మీయుడు. విశ్వనాథ రచించిన రామాయణ కల్పవృక్షాన్ని శ్రావ్యమైన కంఠంతో తమదైన శైలిలో అంతరార్థాలను విశదీకరిస్తూ రసికులకు వినిపించ గలిగి, అయన మూర్తి తత్వాన్ని ఆవిష్కరించాడు. తానే రచించాడా అన్నంతగా ప్రజల్లోకి రామాయణ కల్పవృక్షాన్ని తీసుకెళ్లాడు. జువ్వాడి ప్రోద్బలంతోనే విశ్వనాథ సత్య నారాయణ కరీంనగర్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేశారు. విశ్వనాథ 'భక్తియోగ' అనే పద్యకావ్య సంపుటిని జువ్వాడి కోసం రాసి అంకితం ఇచ్చారు. 'కల్పవృక్షంలో కైకేయి', 'వేయి పడగలలో విశ్వనాథ జీవితం' వంటి జువ్వాడి సాహిత్య వ్యాసాలు సాహిత్యలోకంలో సంచలనాలు సృష్టించాయి. నవ్య సాహిత్యోద్యమ కాలంలో కవిసామ్రాట్ విశ్వనాథ సత్య నారాయణ కొంతకాలం పాటు "జయంతి" అనే సాహిత్య పత్రిక నడిపాడు. తర్వాత దానికి జువ్వాడి సారథ్యం వహించాడు. వివిధ పత్రికల్లో జువ్వాడి రాసిన వ్యాసాలన్నింటినీ సంకలనం చేసి తెలుగు అకాడమీ మాజీ డైరెక్టర్ వెలిచాల కొండలరావు 'సాహిత్య ధార' పేరుతో ఒక పుస్తకాన్ని ముద్రించాడు. జువ్వాడి సాహిత్య కృషికి గాని, సంపాదకత్వం వహించినప్పటి జయంతి పత్రికకు గాని రావాల్సిన కీర్తి ప్రతిష్ఠలు రాలేదు. అయినా జయంతి సంపాదకుడిగా ఆయన సంపాదకత్వం పత్రికా రంగానికే వన్నె తెచ్చింది. నాడు ఇంటర్ చివరి సంవత్సరం చదువుతున్న సి.నారాయణరెడ్డి తొలి కవిత అచ్చయింది ఆ పత్రికలోనే. జీవితమంతా సాహితీ అధ్యయనం తోను, విశ్వనాథ కల్పవృక్ష గానంతోను గడిపాడు. ఇటీవలే విశ్వనాథ ప్రత్యేక సంచికను సాహిత్యపీఠం ఆయనకు అంకితం చేసింది.

## కల్తీ నెయ్యి వ్యవహారంలో వైసీపీ గుట్టురట్టు... ఇవిగో ఆధారాలు

- మొదటి పేజి తరువాయి

2019లో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే టీటీడీ నెయ్యి సరఫరా నిబంధనలను అనర్హులకు అనుకూలంగా మార్చారని పయ్యావుల ఆరోపించారు. గతంలో సరఫరాదారులకు ఉండాల్సిన రూ.250 కోట్ల టర్నోవర్‌ను రూ.150 కోట్లకు, మూడేళ్ల అనుభవాన్ని ఏడాదికి తగ్గించి కల్తీకి తలుపులు తెరిచారని విమర్శించారు. 2022లోనే నెయ్యి నాణ్యతపై అనుమానంతో మైసూరులోని సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ పంపగా, అందులో జంతు అవశేషాలున్నట్లు నివేదిక వచ్చిందని తెలిపారు. కానీ, నాటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి ఆ నివేదికను తొక్కిపెట్టి భక్తుల మనోభావాలతో ఆడుకున్నారని ఆయన ధ్వజమెత్తారు.ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తులో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయని మంత్రి తెలిపారు. ఈ వ్యవహారంలో సుమారు రూ.240 కోట్ల అవినీతి జరిగినట్లు ప్రాథమికంగా తేలిందన్నారు. నాటి ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్న ఈ కల్తీ కథలో కీలక వ్యక్తి అని, అతడు లీటరుకు రూ.25 చొప్పున లంచం డిమాండ్ చేసినట్లు సిట్ నివేదిక స్పష్టం చేసిందని పేర్కొన్నారు. చిన్న అప్పన్న ఖాతాకు నేరుగా రూ.4 కోట్లు బదిలీ అయ్యాయని, దీని వెనుక ఉన్న పెద్ద తలలు ఎవరో తేలాల్సి ఉందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో టీటీడీ ప్రక్షాళన చేపట్టామని పయ్యావుల వివరించారు. నెయ్యి నమూనాలను నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డ్ (డీఎన్‌డీబీ)కు పంపగా, అందులో జంతువుల కొవ్వు కలిసినట్లు శాస్త్రీయంగా నిర్ధారణ అయ్యిందని తెలిపారు. సిట్ చార్జ్‌షీట్‌లోని 35వ పేజీలో కూడా ఈ విషయం స్పష్టంగా ఉందని చెప్పారు. ఇంత స్పష్టమైన నివేదికలు ఉండగా, వైసీపీ నేతలు తమకు క్లీన్‌చిట్ వచ్చిందంటూ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు.

"దేవుడి విషయంలో తప్పు చేసి పశ్చాత్తాపం లేకుండా సంబరాలు చేసుకుంటున్నారు. మీకు జైళ్లు, బెయిళ్లు కొత్త కాదు, వాటిపై సంబరాలు చేసుకోండి కానీ, స్వామివారి విషయంలో అబద్ధాలు ఆడకండి" అని పయ్యావుల హితవు పలికారు. తిరుమల పవిత్రతను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని, ఈ వ్యవహారంలో దోషులు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పర్యటన నుంచి తిరిగి వచ్చాక, ఈ అంశంపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.

## విశాఖలో చంద్రబాబు కుటుంబం రూ.5 వేల కోట్ల విలువైన భూములను లాగేసుకుంది

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన కుటుంబంపై వైసీపీ అధినేత జగన్ సంచలన ఆరోపణలు చేశారు. విశాఖపట్నంలో సుమారు రూ.5,000 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను అధికార దుర్వినియోగంతో కబ్జా చేశారని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు హాలో ఇండియాడ ఇది ఒక వేక్-అప్ కాల్" అంటూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. చంద్రబాబు కుటుంబం సాగిస్తున్న భూ దోపిడీని దేశం గమనించాలని కోరారు.రుషికొండ సమీపంలో ఉన్న 54.79 ఎకరాల అత్యంత విలువైన భూమిని చంద్రబాబు తన కుటుంబ సభ్యుడైన విశాఖ ఎంపీ శ్రీభరత్‌కు అక్రమంగా కట్టబెట్టారని జగన్ ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలో స్వాధీనం చేసుకుని, ఫెన్సింగ్ వేసిన ఈ భూములను ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం ఉచితంగా బహుమానంగా ఇచ్చిందని ధ్వజమెత్తారు. నారా లోకేశ్ కు ఎలాంటి అధికార పరిధి లేకపోయినా, విద్యాశాఖ ద్వారా ఒక మెమో జారీ చేయించి తన తోడల్లుడికి భూములు కేటాయించేలా చక్రం తిప్పారని జగన్ మండిపడ్డారు. ఇది చంద్రబాబు కుటుంబ కుట్రలో భాగమేనని విమర్శించారు.

ఈ భూ కేటాయింపు తీర్మానాన్ని ఆమోదింపజేయడానికి చంద్రబాబు తీవ్ర ఒత్తిళ్లు, బెదిరింపులకు పాల్పడ్డారని జగన్ పేర్కొన్నారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) సభ్యులను భయపెట్టి ఏకపక్షంగా ఆమోదించుకున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడేందుకు ప్రయత్నించిన వైసీపీ కార్పొరేటర్లపై భౌతిక దాడులు చేసి, బలవంతంగా బయటకు పంపించారని, ఈ దాడుల్లో పలువురు గాయపడినా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారని తెలిపారు. ఈ భూ దోపిడీని అమలు చేయడం కోసమే బీసీ యాదవ వర్గానికి చెందిన వైసీపీ మహిళా మేయర్‌ను తొలగించారని, కార్పొరేటర్లను కోట్లతో కొనుగోలు చేసి ప్రజాస్వామ్యాన్ని బుల్డోజ్ చేశారని ఆరోపించారు.చంద్రబాబు అధికారంలో ఉన్న ప్రతిసారీ ప్రభుత్వ ఆస్తులు మాయమవుతాయని, వారి కుటుంబ ఆస్తులు మాత్రం పెరుగుతాయని, ఇది ఒక పరిపాటిగా మారిపోయిందని జగన్ విమర్శించారు. చంద్రబాబు, లోకేశ్ తమ పాలనను ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారంగా మార్చేశారనడంలో ఎలాంటి సందేహం లేదని ఆయన స్పష్టం చేశారు.

## బలూచిస్తాన్‌లో రెచ్చిపోయిన వేర్పాటువాదులు

- మొదటి పేజి తరువాయి

చెప్పుకుంటున్నారు. ఉగ్రవాదులు ఒకే సమయంలో వేర్వేరు నగరాల్లో ఉన్న సైనిక శిబిరాలు, ప్రభుత్వ కార్యాలయాలపై దాడులు చేశారు.

సోషల్ మీడియాలో వచ్చిన వీడియోల ప్రకారం.. ఉగ్రవాదులు జనావాసాల్లోకి చొరబడి వాహనాలకు నిప్పంటించారు. రైఫిళ్లు పట్టుకుని రోడ్ల మీద తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. క్వెట్టా, గ్వాదర్, నుష్కి వంటి నగరాల్లో కాల్పులు, పేలుళ్లు జరిపారు.

దింతో ప్రాంతీయ రాజధాని అయిన క్వెట్టాలో పరిస్థితి చాలా దారుణంగా మారింది. బాంబు పేలుళ్లు, కాల్పులు ఆగకపోవడంతో అధికారులు ఆసుపత్రుల్లో ఎమర్జెన్సీ ప్రకటించారు. సరియాబ్ రోడ్డులో ఓ పోలీసు వాహనంపై దాడి చేసి ఇద్దరు అధికారులను చంపడమే కాకుండా, వాహనాన్ని తగలబెట్టారు. సైన్యం, ఇంటెలిజెన్స్ ఆఫీసులపై ఆత్మాహుతి దాడులు చేశామని, కొన్ని చోట్ల సైనిక శిబిరాల్లోకి కూడా చొరబడ్డామని దీూూ ప్రకటించుకుంది. పాకిస్థాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహ్సిన్ నఖ్వీ ఈ ఘటనలను ధృవీకరించారు. ఉగ్రవాదుల ఏరివేత కొనసాగుతోందని, ఇప్పటికే 37 మందిని మట్టుబెట్టామని తెలిపారు. శాంతి భద్రతలను కాపాడేందుకు భద్రతా దళాలు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాయని ప్రభుత్వం పేర్కొంది.

## సీఎం చంద్రబాబుపై అంబటి రాంబాబు తీవ్ర అసభ్య వ్యాఖ్యలు

ముఖ్యమంత్రి చంద్రబాబుపై తీవ్ర అసభ్య పదజాలంతో దూషణలకు దిగిన మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబుపై చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గుంటూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యాలరావు శనివారం జిల్లా ఎస్పీకి అధికారికంగా ఫిర్యాదు చేశారు. అంబటిపై వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.వివరాల్లోకి వెళితే.. గుంటూరు జిల్లా గోరంట్లలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద, తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ అయిందంటూ 'మహాపాపం' పేరుతో టీడీపీ నేతలు ఇటీవల ఒక ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీని వెంటనే తొలగించాలని, లేదంటే తామే తొలగిస్తామని అంబటి రాంబాబు హెచ్చరించారు. చెప్పినట్టుగానే శనివారం ఉదయం గోరంట్ల వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి, ఆ తర్వాత ఫ్లెక్సీ వద్దకు వెళ్లేందుకు ఆయన సిద్ధమయ్యారు.ఈ విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు భారీగా ఫ్లెక్సీ వద్దకు చేరుకున్నాయి. ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉండటంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, ఫ్లెక్సీ వద్దకు రావద్దని అంబటికి సూచించారు. అయితే, ఆలయం నుంచి తిరుగు ప్రయాణమైన అంబటిని టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. ఆయన కారు దిగేందుకు ప్రయత్నించగా పోలీసులు నివారించారు. ఈ క్రమంలో తీవ్ర ఆగ్రహానికి లోనైన అంబటి రాంబాబు.. ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి అత్యంత దారుణమైన భాషలో దూషించారు.

పరిస్థితి చేయిదాటిపోతుండటంతో పోలీసులు అంబటిని అక్కడి నుంచి పంపించివేశారు. ఈ ఘటన అనంతరం గుంటూరులోని ఆయన నివాసం వద్ద కూడా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అంబటి వ్యాఖ్యలను 'అత్యంత దుర్మార్గం' అని మంత్రి కొల్లు రవీంద్ర, పార్థసారథి వంటి వారు తీవ్రంగా ఖండించారు. ఒక మాజీ మంత్రి అయి ఉండి, ముఖ్యమంత్రిపై ఇంతటి అనుచిత భాషను ఉపయోగించడం ఏమిటని టీడీపీ నేతలు మండిపడుతున్నారు.

## ఇ-సైకిళ్లపై భారీ రాయితీ..

### గిన్నిస్ రికార్డుతో ఏపీ సర్కార్ కొత్త చరిత్ర

ఏపీలో పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు పర్యావరణ హిత ఇ-సైకిళ్లను భారీ రాయితీపై అందిస్తోంది. ఈ క్రమంలో చిత్తూరు జిల్లా కుప్పంలో 24 గంటల వ్యవధిలో 5,555 ఇ-సైకిళ్లను పంపిణీ చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. పర్యావరణ హితమైన కుప్పం నియోజకవర్గాన్ని తీర్చిదిద్దడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.రూ.10 వేల సబ్సిడీ.. రూ.25 వేలకే సైకిల్ ఇ-మోటరాడ్స్ అనే సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ప్రకారం, రూ.35,000 విలువైన ఒక్కో ఇ-సైకిల్‌పై ప్రభుత్వం రూ.10,000 రాయితీ కల్పిస్తోంది. దీంతో ప్రజలు కేవలం రూ.25,000 చెల్లించి ఈ సైకిల్‌ను సొంతం చేసుకోవచ్చు. ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే ఈ సైకిల్ 40 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని అధికారులు తెలిపారు. విశేషమేమిటంటే ఈ సైకిళ్లను కుప్పంలోనే ఇ-మోటరాడ్ సంస్థ అసెంబుల్ చేస్తోంది.సీఎం చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఈ సైకిళ్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా తూంసీలోని ప్రజావేదిక వద్దకు ఆయన దాదాపు 3 కిలోమీటర్ల దూరం ఇ-సైకిల్‌పై ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం గిన్నిస్ రికార్డు సాధించినందుకు గాను చిత్తూరు జిల్లా కలెక్టర్‌కు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ధృవీకరణ పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, కుప్పం ఒక కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టిందని అన్నారు. "ఎన్నికల్లో సైకిల్‌కు ఓటేశారు, అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపించాం" అని పేర్కొన్నారు. ఇ-సైకిళ్లకు పైసా ఖర్చు లేకుండా ఇంట్లోనే ఛార్జింగ్ చేసుకోవచ్చని, రాబోయే రోజుల్లో మరిన్ని ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు.

## భారత్ పై ట్రంప్ 50 శాతం సుంకాలు...

భారతదేశం తన సొంత ప్రయోజనాలను కాదని, అమెరికా చెప్పే ప్రతిదానికి తలాడించదని యూఎస్ రిటైర్డ్ ఆర్మీ కల్నల్, రక్షణ రంగ నిపుణుడు డగ్లస్ మాక్‌గ్రెగర్ అన్నారు. సొంత ప్రయోజనాలకు రాజీపడి ఏ దేశం కూడా ఇతర దేశాలతో చర్చలు జరపబోదని అన్నారు. రష్యాతో వ్యాపారం చేస్తోందన్న కారణంతో భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు 50 శాతం సుంకాలు విధించడం ట్రంప్ మూర్ఖ మనస్తత్వానికి నిదర్శనమని మండిపడ్డారు.కొంతకాలంగా అమెరికా, భారత్ మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్నాయి. ఈ చర్చలపై డగ్లస్ స్పందిస్తూ, అమెరికా ఎప్పుడూ కూడా ప్రపంచ దేశాలు తమకు అనుకూలంగా ఉండాలని కోరుకుంటుందని, లేదంటే వ్యతిరేకంగా ఉన్నాయని భావిస్తుందని అన్నారు. అమెరికా చెప్పే ప్రతి అంశంతో లేదా అమెరికా చేసే ప్రతి దానితో భారత్ ఎప్పుడూ ఏకీభవించాలని చూడవద్దని అన్నారు.దశాబ్దాలుగా భారత్, రష్యా మిత్ర దేశాలుగా కొనసాగుతున్నాయని, ఇప్పుడు వాటిని కలిసి వ్యాపారం చేయవద్దంటే అవి అమెరికాను వ్యతిరేకించే అవకాశం ఉందని అన్నారు. "మీరు రష్యాతో వ్యాపారం చేస్తే కనుక మేం మీకు వ్యతిరేకం" అనేది మూర్ఖత్వమని అన్నారు. మలేసియా వంటి దేశాలు అమెరికాతో వాణిజ్య ఒప్పందం కోసం తమ ముఖ్య విధానాల విషయంలో కూడా రాజీపడాల్సి వచ్చిందని అన్నారు. ప్రపంచ దేశాలపై బెదిరింపులకు పాల్పడుతూ ఇష్టారీతిన సుంకాలు విధిస్తే అది అమెరికాకే నష్టమని అన్నారు.

## గగన్‌యాన్ కోసం 8 వేలకు పైగా ప్రయోగాలు

- మొదటి పేజి తరువాయి

8 వేలకు పైగా ప్రయోగాలు సఫలమయ్యాయని తెలిపారు. వ్యోమగాముల భద్రత దృష్ట్యా మూడు మానవ రహిత రాకెట్‌లను ప్రయోగిస్తున్నట్లు తెలిపారు. మొదటి ప్రయోగం మార్చిలో చేపట్టేందుకు శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారని వెల్లడించారు.రాకెట్‌లోని ప్రతి వ్యవస్థను పరిశీలిస్తున్నామని, గగన్‌యాన్ మిషన్ విజయవంతం చేయడమే అంతిమ లక్ష్యమని పేర్కొన్నారు. రెండో మానవరహిత రాకెట్ ప్రయోగం ఈ ఏడాది చివరలో ఉంటుందని తెలిపారు. భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే లక్ష్యంతో ఇస్రో ప్రతిష్ఠాత్మక గగన్‌యాన్ మిషన్ చేపట్టగా, ఈ ప్రాజెక్టు తుది దశకు చేరిందని అన్నారు.మానవ సహిత స్పేస్ మిషన్‌లో భాగంగా మార్చిలో వ్యోమమిత్ర రోబోను అంతరిక్షంలోకి పంపనున్నారు. కాగా, 2027లో చేపట్టనున్న గగన్‌యాన్ మిషన్ కోసం వాయుసేనకు చెందిన గ్రూప్ కెప్టెన్లు ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, అంగద్ ప్రతాప్, అజిత్ కృష్ణన్, వింగ్ కమాండర్ శుభాంశు శుక్లా ఎంపికైన విషయం తెలిసిందే.

## ఉప ముఖ్యమంత్రిగా సునేత్రా పవార్ ప్రమాణ స్వీకారం.. తొలి మహిళగా చరిత్ర

రాజ్యసభ ఎంపీ సునేత్రా పవార్ మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రంలో ఆ పదవి వరించిన తొలి మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. ముంబైలోని లోక్‌భవన్‌లో, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సమక్షంలో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ఆమెతో ప్రమాణం చేయించారు.

సునేత్రా పవార్ ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం లోక్ భవన్‌లో 'అజిత్ దాదా అమర్ రహే' అంటూ నినాదాలు ప్రతిధ్వనించాయి. సునేత్రా పవార్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. అజిత్ పవార్ దార్శనికతను సునేత్రా నెరవేరుస్తారని ఆయన ఆకాంక్షించారు. "మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన, ఈ బాధ్యతను చేపట్టిన మొదటి మహిళ సునేత్రా పవార్ జీకి శుభాకాంక్షలు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఆమె అవిశ్రాంతంగా పనిచేస్తారని మరియు దివంగత అజిత్‌దాదా పవార్ దార్శనికతను నెరవేరుస్తారని నేను విశ్వసిస్తున్నాను" అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో చేసిన పోస్టులో పేర్కొన్నారు.

కాగా, ఇటీవల బారామతిలో జరిగిన విమాన ప్రమాదంలో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ దుర్మరణం చెందారు. దీనితో ఆ పార్టీ శాసనసభా పక్ష నేతగా ఆయన భార్య సునేత్రా పవార్‌ను ఎన్సీపీ వర్గాలు ఎన్నుకున్నాయి. దీంతో ఆమె ఈ రోజు ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.

## ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు తన సొంత నియోజకవర్గం కుప్పంలో రెండో రోజు పర్యటనలో భాగంగా ప్రజలతో మమేకమయ్యారు. శనివారం ఆయన బెగ్గిపల్లె గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే స్వయంగా వెళ్లి, వారిని ఆప్యాయంగా పలకరించారు.గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. వారి యోగక్షేమాలను విచారించి, ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ముగ్గురు లబ్ధిదారులకు తన చేతుల మీదుగా పింఛన్లు అందించారు.

మునెమ్మ అనే వృద్ధురాలికి వృద్ధాప్య పింఛను, చిన్నతాయమ్మ అనే మహిళకు వితంతు పింఛను, వెంకటరామప్పకు వృద్ధాప్య పింఛను అందజేసి వారికి భరోసా కల్పించారు. ముఖ్యమంత్రే నేరుగా తమ ఇంటికి వచ్చి పింఛను అందించడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల అమలును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించడంలో భాగంగా సీఎం ఈ కార్యక్రమం చేపట్టారు.

## ఏప్రిల్ 30 నాటికి అయోధ్య రామాలయం అన్ని పనులు పూర్తి

- మొదటి పేజి తరువాయి

అవి పూర్తవుతాయని తెలిపారు. రూ.1,900 కోట్లకు గాను ఇప్పటి వరకు రూ.1,600 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ఏప్రిల్ 30 నాటికి పేపర్ వర్క్, బిల్లు చెల్లింపులు కూడా పూర్తవుతాయని అన్నారు. ఆ తర్వాత ఆలయం శ్రీరామ జన్మభూమి ఆలయ ట్రస్ట్ పరిధిలోకి వస్తుందని వెల్లడించారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఒక రోజు ముందుగానే పంపిణీ

**గంగవరం, పెన్ పవర్, జనవరి 31:**పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం గంగవరం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను శనివారం ఒక రోజు ముందుగానే పంపిణీ చేశారు. ఫిబ్రవరి నెల పెన్షన్లను ఒకటో తారీకు ఆదివారం సెలవు రోజు కావడంతో జనవరి 31వ తేదీన లబ్ధిదారుల వద్దకే వెళ్లి పెన్షన్లు అందజేశారు.ఎండపల్లి పంచాయితీ చిన్న అడ్డపల్లి గ్రామం, గంగవరం పంచాయితీ కొత్త గంగవరం గ్రామం, ఆముదాలబంద పంచాయితీ రాజంపాలెం గ్రామాల్లో ఈ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.కొత్త గంగవరం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, మాజీ ఎంపీటీసీ కోసు బుల్లియమ్మ, సచివాలయ సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సందీప్ పాల్గొన్నారు. చిన్న అడ్డపల్లి గ్రామంలో మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభతో పాటు సచివాలయ సిబ్బంది, హార్టికల్చర్ అధికారి కళ్యాణ్ నాయుడు పాల్గొన్నారు.రాజంపాలెం



గ్రామంలో మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ, టీడీపీ సీనియర్ నాయకులు కుంజం కృష్ణమూర్తి దొర, కలుముల చిన్నాలదొర, కలుముల వెంకన్నదొర, పండా రఘుపతి, పండా రత్నం, సచివాలయ సిబ్బంది డిజిటల్ అసిస్టెంట్ సవలం వెంకటేష్, పెన్షన్ దారులు మరియు ఇతరులు పాల్గొన్నారు.


పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# ఓజుబంధ నల్లరాయి క్వారీలపై జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ విచారణకు ఆదేశం

## జిల్లా కలెక్టర్, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు నోటీసులు

## ఆదివాసుల నష్టంపై రాజీలేని పోరాటం కొనసాగుతుంది -- కుంజ శ్రీను





**గంగవరం ,పెన్ పవర్, జనవరి 31:**పోలవరం జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో నల్లరాయి క్వారీల కార్యకలాపాల వల్ల ఆదివాసి ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోందని వచ్చిన ఫిర్యాదులపై జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ విచారణకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ మరియు గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు నోటీసులు పంపినట్లు ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను తెలిపారు.గంగవరం మండలం జగ్గంపాలెం పంచాయతీ పరిధిలోని ఓజుబంధ గ్రామంలో నిర్వహిస్తున్న నల్లరాయి క్వారీల వల్ల స్థానిక ఆదివాసి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు.క్వారీల కారణంగా నివాస గృహాలు బీటలు వారడం, పంట పొలాలు దెబ్బతినడం, రహదారులు పాడైపోవడం, పర్యావరణ కాలుష్యం పెరగడం, ప్రజల ఆరోగ్యం క్షీణించడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వివరించారు.ఈ సమస్యలపై గత రెండు నెలలుగా గ్రామ ప్రజలు ఆందోళనలు నిర్వహిస్తూ జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్, మైనింగ్ శాఖ అధికారులకు పలు మార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ క్షేత్రస్థాయి విచారణ జరగలేదని ఆరోపించారు. సంబంధిత శాఖలు సమస్యను పక్కదారి పట్టిస్తున్నాయని విమర్శించారు.బాధిత ప్రజల తరఫున ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్, న్యూఢిల్లీకి ఫిర్యాదు చేయగా, కమిషన్ స్పందించి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. పది రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించగా, విఫలమైతే సంబంధిత అధికారులు కమిషన్ ముందు హాజరు కావాల్సి ఉంటుందని నోటీసులో పేర్కొన్నట్లు వెల్లడించారు.ఏజెన్సీ ప్రాంతాల్లో కొందరు నాన్-ట్రైబల్స్‌కు మైనింగ్ లాభాలు చేరేలా చేస్తున్నారని, ఆదివాసుల హక్కులు హరించబడుతున్నాయని కుంజ శ్రీను ఆరోపించారు.ఆదివాసులు ఐక్యంగా నిలిస్తే మైనింగ్ వల్ల కలుగుతున్న నష్టాన్ని అరికట్టవచ్చని, రాజకీయాలకతీతంగా పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని, ఎటువంటి బెదిరింపులకు భయపడబోమని స్పష్టం చేశారు.

# వాడకమంటే ఇదే మరి..!



భోగాపురంలో సంపద కేంద్రం



మద్యంబాటిళ్లు తో నిండిన తొట్టెలు

## -రూ.లక్షలు బూడిదలో..

**ఏలూరు జనవరి 31 పెన్‌పవర్ :** పెదవేగి మండలంలోని గ్రామాల్లో జీరో మేనేజ్‌మెంట్ కోసం సంపద కేంద్రాల నిర్వహణ అమలు జరుగుతోంది.వర్మీ కంపోస్ట్ తయారు చేయడానికి రైతుల నుండి పేడ సేకరించి,వారికి 50శాతం వర్మీ ఇచ్చుటకు ఒప్పందం చేసుకోవాల్సి ఉంది.అటువంటి కార్యక్రమాలను చేపట్టకుండా పంచాయితీ సిబ్బంది నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారు.
కాగితాల్లో సంపద సృష్టిస్తున్నట్లుచూపెడుతున్నారు.
పెదవేగి మండలంలో 30 పంచాయితీలు ఉన్నాయి.రూ.లక్షలు వెచ్చించి 2019-24లో అన్ని చోట్ల సంపద కేంద్రాలు నిర్మించారు.నిర్వహణ లోపంతో అన్ని గ్రామాల్లో నిరుపయోగంగా తయారయ్యాయి.ఊరికి దూరంగా ఉన్న ఉన్నాయన్న కారణంగా పలు చోట్ల పారిశుధ్య సిబ్బంది సంపద కేంద్రాలకు చెత్త తరలించడం లేదు.రహదారుల పక్కన పారబోసి..దహనం చేస్తున్నారు.ఫలితంగా పారిశుద్ధ్యం నానాటికీ లోపిస్తోంది.అధికారులు,సిబ్బంది కేంద్రాలను వినియోగంలోకి తేవాలని గ్రామీణ ప్రజలు,రైతులు, కోరుతున్నారు.విజయరాయి : రాయన్నపాలేనికి వెళ్లే రోడ్‌లో చెరువు పక్కన సంపద కేంద్రం కేంద్రం నిర్మించారు.చెరువులోకి నీరు చేరడంతో కేంద్రానికి వెళ్లే దారి లేకుండా పోయింది.
రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన కేంద్రం నిరుపయోగంగా మారింది.
భోగాపురం: భోగాపురం సంపద కేంద్రం అధికారులు పూర్తిగా విస్మరించారు.చెత్త నుండి సంపద సంపద సృష్టించాలనే లక్ష్యంతో ప్రభుత్వం షెడ్‌ను నిర్మించింది.సంపద కంద్రం పశువుల కొట్టంగా మారింది.వినియోగంలో లేక పోవడంతో స్దానికులు పశువులను కట్టేస్తున్నారు.ఎరువు తయారీ కోసం నిర్మించిన తొట్టెల్లో మద్యం బాటిళ్లతో నిండిపోయాయి.మండల స్దాయి అధికారులు స్పందించి సంపద కేంద్రాలను వినియోగంలోకి తెచ్చి సంపద సృష్టిస్తే గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడి,గ్రామ పంచాయితీలకు ఆదాయం సమకూరి ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది.


# వృద్ధులను ప్రేమతో చూడండి:ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 31.**కుటుంబంలో ఉన్న తల్లిదండ్రులు తదితర వృద్ధులను ప్రేమతో చూడాలని,వారి ఆలనా పాలన పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వం విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు.33 వ వార్డు లో వృద్ధాప్య పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులను ఆదరించాలని, ఆరోగ్య సమస్యలను పట్టించుకుని భరోసా కల్పించాలని అన్నారు. ప్రభుత్వం నుంచి కొంత ఆసరా కల్పించే ఉద్దేశంతో పింఛన్లను ఇస్తున్నామని కానీ కుటుంబ సభ్యుల ప్రేమ, ఆదరణలే వృద్ధుల ఆరోగ్యానికి కీలకమని సూచించారు. కుటుంబం కోసం కష్టపడి, ఎన్నో త్యాగాలు చేసిన వృద్ధులను ఆదరించటం ప్రతి ఒక్కరి బాధ్యతని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యేసు బాబు, తెలుగుదేశం పార్టీ జిల్లాఆర్గనైజింగ్ సెక్రటరీ వాడపల్లి సుబ్బరాజు, జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశి, పెంటపాడు మండలం జనసేన అధ్యక్షుడు పుల్ల బాబి, చాపల రమేష్, పైబోయిన రఘు, పాలూరి వెంకటేశ్వర రావు, పైబోయిన వెంకటరామయ్య, మద్దిపాటి ధర్మేంద్ర,, ఏపూరి సాయి పడాల శ్రీను రామ లక్ష్మణ్, పేతిన గిరి, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా కోనా శ్రీనివాసరావు

## నేడు ప్రమాణస్వీకారం



**పెన్ పవర్, ఉంగుటూరుజనవరి 31**అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడిగా ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరానికి చెందిన కోనా శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఫిబ్రవరి 1వ తేదీన తాడేపల్లిగూడెం కమ్మ కల్యాణ మండపంలో జరిగే కార్యక్రమంలో అధికారికంగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.
ఇంతకుముందు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా, ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా కోనా శ్రీనివాసరావు విశేష సేవలు అందించారు. ఆర్యవైశ్యుల సామాజిక, ఆర్థిక, విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన తెలిపారు.
ప్రమాణస్వీకార కార్యక్రమంలో భాగంగా ఆర్యవైశ్య పేద విద్యార్థులకు 100 ల్యాప్‌టాప్‌లు, మహిళలకు 100 వెట్ గ్రైండర్లు పంపిణీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.
ఈ కార్యక్రమానికి తాడేపల్లిగూడెం, ఉంగుటూరు ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాసరావు, ధర్మరాజు, టీజీ వెంకటేష్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరు కానున్నారు.
ఈ విషయాలను శనివారం కైకరం గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కోనా శ్రీనివాసరావు వెల్లడించారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# కడియం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ప్రభుత్వానికి రూ. 2.62 కోట్లు నష్టం

- రెండో రోజు ఏసీబీ తనిఖీల్లో బయటపడిన వైనం
- ఏసీబీ డీఎస్పీ కిషోర్ కుమార్ వెల్లడి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 31 :**కడియం మండలం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రెండో రోజు ఏసీబీ తనిఖీల్లో రిజిస్ట్రేషన్ పత్రాల్లో ఆస్తి విలువ తగ్గింపు వల్ల ప్రభుత్వానికి సుమారు రూ. 2.62 కోట్లు నష్టం వాటిల్లినట్లు ఏసీబీ డీఎస్పీ కిషోర్ కుమార్ తెలిపారు. కార్యాలయంలో రెండు రోజులపాటు జరిపిన తనిఖీల్లో సబ్ రిజిస్ట్రార్, ఈ శ్రీలక్ష్మి సిబ్బంది ,దస్తావేజు ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయముతో పలు అవినీతి అక్రమాలు జరిగినట్లు గుర్తించామని, ఆమె 11 రిజిస్ట్రేషన్లు తక్కువ ఫీజులతో రిజిస్ట్రేషన్ చేయడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి రూ.2.62 కోట్లు గండి పడిందన్నారు. ఆయన తెలిపారు. మొదటిరోజు గురువారం నాటి తనిఖీల్లో కార్యాలయంలో 1,82,000 లక్షల రూపాయలు అనాధికారికంగా ఉన్న నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. సంగతి విధితమే. ఆమె ఉద్యోగ కాలంలో కార్యాలయంలో 9 11 రిజిస్ట్రేషన్ లు జరిగాయని, వీటిలో చాలావరకు అనుబంధ పత్రాలు, సరైన పత్రాలు లేవని గుర్తించామన్నారు.ఈనెల 27 28 తేదీల్లో జరిగిన కార్యాలయంలో జరిగిన రిజిస్ట్రేషన్లు 144 కాగా ,వాటిలో



107 రిజిస్ట్రేషన్ లను సంబంధిత వ్యక్తులకు సకాలంలో ఇవ్వకపోవడం కూడా నిబంధనలకు విరుద్ధమే నని స్పష్టం చేశారు. గతంలో శ్రీలక్ష్మి పనిచేసిన కార్యాలయాలను రికార్డులు కూడా పరిశీలించగా రూ.90 లక్షల నుండి సుమారు కోటి రూపాయల వరకు ఆర్థిక తేడాలు వచ్చాయని తాము గుర్తించామన్నారు. లక్ష్మీపై అవినీతిపై మరింత విస్తృతమైన విచారణ జరపాల్సిన అంశంపై ప్రభుత్వానికి నివేదికను పంపిస్తామన్నారు.

# మరగంటి వారి రామాలయంలో లక్ష పత్రిపూజ..



**కోరుకొండ, పెన్ పవర్, జనవరి 31:** కోరుకొండ గ్రామంలో మరగంటి వారి రామాలయంలో మొట మొదటిసారిగా ఆలయ ధర్మకర్త మరగంటి శ్రీను ఆధ్వర్యంలో లక్ష పత్రి పూజ కార్యక్రమం వేద పండితులు, అన్నవరం దేవస్థానం వేద పండితులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వేద పండితులకు లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మరగంటి శ్రీను, మరగంటి సురేష్ రామసేన సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వానికి మంచి,బుద్ధిని ప్రసాదించండి

## వై.సి.పి.పార్టీ మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు

## వై.సి.పి.పార్టీ ముంపుమండలాల నాయకులు కార్యకర్తలు



**వి.ఆర్.పురం పెన్.పవర్.జనవరి.31**కూటమి ప్రభుత్వానికి మంచి,బుద్ధిని ప్రసాదించండి. అంటూ వై.సి.పి.పార్టీ ముంపుమండలాల నాయకులు వెంకటరెడ్డి పేటలో వెలసియున్న వెంకటేశ్వరస్వామి వారిని కోరారు.గడిచిన కాలంలో మహా పుణ్యక్షేత్రమైన కలియుగ వైకుంఠంగా భావించే తిరుమల తిరుపతి దేవస్థానం ప్రసాదం లడ్డూ తయారీలో వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసిందని ఆంధ్ర ప్రదేశ్ ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడడం దానికి కూటమి ప్రభుత్వం వత్తాసు పలకడం భక్తుల మనోభావాలకు భంగం కలిగించే విధంగా తిరుమల తిరుపతి లడ్డుపై విష ప్రచారం చేయడం జరి గింది.తర్వాత ఆ యొక్క కేసును సీబీఐకు అప్ప చెప్పడం చేశారు.సిబిఐ నివేదికలో ఎక్కడా కూడా నెయ్యిలో కల్తీ జరగలేదని, ధ్రువీకరించింది.అంతే కాకుండా సుప్రీంకోర్టు కూడా నెయ్యిలో కల్తీ జరగలేదని స్పష్టంగా తేల్చి చెప్పింది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి,పిలుపుమేరకు రంపచోడవరం నియోజకవర్గం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీఅనంతబాబు, రంపచోడవరం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు నాగులపల్లి ధనలక్ష్మి,సూచనలమేరకు చింతూరు,ఎటపా క వి.ఆర్.పురం,కూనవరం మండలాల మండల కన్వీనర్ల ఆధ్వర్యంలో శనివారం వెంకటరెడ్డిపేట వెంకటేశ్వరస్వా మి వారిగుడి సన్నిధిలో వినతి పత్రం ఇచ్చే కార్యక్ర మం చేపట్టారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వి.ఆర్.పురం వై.సి.పి.పార్టీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు మాట్లాడుతూగడిచిన కొద్దీ కాలంలో కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పోయిందని,రాబోవురోజు లోకూటమి ప్రభుత్వంపై ప్రజలలో బాగా వ్యతిరేకత పెరుగుతుంద ని,ప్రజల నాడిని మళ్లించేందుకే తిరుమల తిరుపతి లడ్డూ లో కల్తీ నెయ్యి వాడాలని,విష ప్రచారం చేశారని ఇలాంటి నీచమైన రాజకీయాలు చేయడం మానుకోవాలని,కూట మి ప్రభుత్వాన్ని విమర్శించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు,ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,కూటమి నాయకులకు అందరికీ కూడా ఆ వెంకటే శ్వరస్వామి వారు మంచి బుద్ధుని ప్రసాదించాలని, ఎన్నిక లకుముందుఇచ్చిన హామీలను నెరవేర్చాలని,రాష్ట్ర ప్రజ లకు సుపరిపాలన అందించాలని,కోరుతూ శనివారం వై. సి.పి.ముంపుమండలాల నాయకులు వెంకటరెడ్డి పేట శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం మెట్లును పై నుంచి కింద వరకు శుభ్రంగా కడిగి,వెంకటేశ్వర స్వామి వారికి వినతి పత్రంఅందజేశారు.ఈ కార్యక్రమంలో వై.సి.పి.పార్టీ మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తిబాబు,ఆర్టిఐ విభాగం జిల్లా అధ్యక్షులు బొడ్డు సత్యనారాయణ,జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలకృష్ణ,ఎస్సీ సెల్,నాయకు లు చీమల కాంతారావు,మండల నాయకులు వడ్డాణపు రాజారావు వైసిపి పార్టీ యూత్,నాయకులు మోడెం నరే ష్,ముంజపు రాంబాబు,గూటాల ముత్యాలరావు,రేఖపల్లి ఎస్సీ కాలనీ యూత్ చీమల శంకర్,పరకా రాజేంద్ర,తదిత రులు పాల్గొ న్నారు.

## ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

**సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రామరాజు పిలుపు**



**గంగవరం, పెన్ పవర్, జనవరి 31:**కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ కి వ్యతిరేకంగా ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు పోలవరం జిల్లా సహాయ కార్యదర్శి పి రామరాజు శనివారం పిలుపునిచ్చారు.శనివారం గంగవరంలో సీఐటీయూ మండల కోకన్వీనర్ ఎస్ మంగయ్యమ్మ అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు పి రామరాజు,కె రాణి పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దుర్మార్గంగా కార్మిక చట్టాలను మార్చి వాటి స్థానంలో లేబర్ కోడ్స్‌ని తీసుకొచ్చిందన్నారు. కార్పొరేట్లకు ఊడిగం చేసేలా తీసుకొచ్చిన ఆ చట్టాలను తక్షణం రద్దు చేయాలనే డిమాండ్‌తో ఫిబ్రవరి 12న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో కార్మిక వర్గం అంతా పాల్గొని జయప్రదం చేయాలన్నారు.కేంద్ర ప్రభుత్వం కార్మికులను కట్టు బానిసలుగా చేయడం కోసమే ఈ లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని విమర్శంచారు.ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలని, కార్మికులందరికీ కనీస వేతనాలు ఇవ్వాలని, పిఎఫ్,ఇఎస్ఐ,ఉద్యోగ భద్రత వంటి సౌకర్యాలు కల్పించాలని,ఉపాధి హామీ చట్టం ద్వారా 200 రోజులు పని దినాలు కల్పించాలని,రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి,ఆశ,మిడ్డే మీల్స్, యూనియన్ నాయకులు వీరయ్యమ్మ,పి శిరీషా,జి వెంకయ్యమ్మ,కె నాగదేవి,పి రాజేశ్వరీ, వెంకటలక్ష్మి ఇతర ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ పంపిణీ, యూఎస్ఎఫ్ సర్వే వేగవంతం చేయాలి





### డిప్యూటీ ఎంపీడీవో గోపన్న దొర

**గంగవరం, పెన్ పవర్, జనవరి 31:**మండల పరిధిలో పెన్షన్ల పంపిణీ మరియు యూఎస్ఎఫ్ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని డిప్యూటీ ఎంపీడీవో గోపన్న దొర సిబ్బందికి ఆదేశించారు. నెల్లిపూడి, అమూదాలబంద గ్రామాలను సందర్శించిన సందర్భంగా సంబంధిత సిబ్బందితో సమీక్ష నిర్వహించి పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.గ్రామాల్లో చెత్త నుండి సంపద తయారు చేసే కేంద్రాలను కూడా ఆయన పరిశీలించారు.అవసరమైన సౌకర్యాలు, పరికరాలు వెంటనే ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.అనంతరం కుసుమరాయి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి, అక్కడి నిర్వహణ, పిల్లలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. సేవలు మెరుగుపరచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఆయన వెంట ఆయా పంచాయతీల కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

## ఒక రోజు ముందుగానే పెన్షన్లు పంపిణీ

### అర్హులైన పేదలందరికి పెన్షన్లు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 31.** 1వ తారీకు ఆదివారం సెలవు దినం కావడంతో ముందు రోజే పెన్షన్లు పంపిణీ చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు
తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు ప్రతీ నెల మొదటి తారీకున పేద ప్రజలకు పింఛన్ పంపిణీ కార్యక్రమం సజావుగా సాగుతుందో లేదో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకుని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్థానిక నాయకులను ఆదేశించడంతో
తాడేపల్లిగూడెం పట్టణంలో స్థానిక14, 17,19వ వార్డులలో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో.. ఉదయాన్నే సచివాలయ సిబ్బందితో పాటు పాల్గొని.. పెన్షన్లు పంపిణీ చేసి
పింఛనుదారులను, పంపిణీ చేసే సచివాలయ సిబ్బందిని కూడా ఎటువంటి ఇబ్బందులు ఉన్నా సరే తనకు తెలియజేయాలని
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, తాడేపల్లిగూడెం పట్టణ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ గొర్రెల శ్రీధర్ అన్నారు..
వీరితోపాటుగా 17వ వార్డు సచివాలయ సిబ్బంది నీలా కుమారి , స్వర్ణ , సూర్యచంద్ర, తదితరులు పాల్గొన్నారరు.

## 37వ జాతీయ రహదారి భద్రత మాస ఉత్సవాలు ముగింపు సందర్భంగా రెండు చక్రాల వాహనం హెల్మెట్ ర్యాలీ






**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 31.** తాడేపల్లిగూడెం రవాణా కార్యాలయం పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా రవాణా అధికారి వారి ఆదేశాలతో 37వ జాతీయ రహదారి భద్రత మాస ఉత్సవాలు ముగింపు సందర్భంగా రెండు చక్రాల వాహనం హెల్మెట్ ర్యాలీ డి .సురేందర్ సింగ్ నాయక్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్. ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా మోటార్ వెహికల్
ఇన్స్పెక్టర్ డి .సురేందర్ సింగ్ నాయక్ మాట్లాడుతూ కళాశాల పిల్లలకు మరియు స్కూల్ పిల్లలు మోటార్ సైకిల్ నడిపే వాళ్లను ఉద్దేశించి ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని అవగాహన కార్యక్రమంలో చాలా మందికి రోడ్ సేఫ్టీ అవగాహన కల్పించడం మరియు వాహనాలు నడిపే వారికి ప్రతి ఒక్కరికి రహదారి భద్రత నియమాలను పాటించాలని కోరారు. తల్లిదండ్రులు రోడ్డు నియమాలు ఎలా పాటించాలి అనే విధానమును పిల్లలకు తగు జాగ్రత్తలు తెలియజేయాలని చెప్పినారు. రవాణా యూనిట్ కార్యాలయం నుండి పెంటపాడు సర్కిల్ వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం పరిధిలోఉన్న టూ వీలర్ షోరూం సిబ్బంది స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

## ఈనెల 2న గంగవరంలో జనతా వారధి

### గిరిజన సమస్యల పరిష్కారానికి 'జనతా వారధి'

### బిజెపి రాష్ట్ర కార్యదర్శి స్వప్న కుమారి



**గంగవరం, పెన్ పవర్, జనవరి 31:**గిరిజన ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో "జనతా వారధి" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి స్వప్న కుమారి తెలిపారు. ఈ నెల 2వ తేదీన గంగవరం మండలం పాత గంగవరం వద్ద ప్రజల నుండి సమస్యల అర్జీలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవన్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయడమే జనతా వారధి కార్యక్రమం లక్ష్యమని వివరించారు.స్థానిక ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించాలని స్వప్న కుమారి పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు.

## ఆధ్యాత్మికవేత్త , దళిత హిందూ ధర్మ పరిరక్షకులు సంత్ రవిదాస్ గారి 649 వ జయంతి




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 31.**స్థానిక డి ఆర్ గోయంక బి.వి.కె మహిళా కళాశాల నందు సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో ఆధ్యాత్మికవేత్త , దళిత హిందూ ధర్మ పరిరక్షకులు సంత్ రవిదాస్ గారి 649 వ జయంతి కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది , ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్పందన ఫౌండేషన్ చైర్ పర్సన్ భోగిరెడ్డి ఆదిలక్ష్మి పాల్గొన్నారు వారు మాట్లాడుతూ చర్మకార వృత్తిలో ఉంటూ ఆరు శతాబ్దాల క్రితమే హిందూ ధర్మం కోసం పనిచేస్తూ హిందూ ధర్మ పరిరక్షకుడిగా ఎనలేని సేవలందించారని అన్నారు. కేవలం తాత్కాలిక తాయిలాలకి మతం మారుతున్న ప్రస్తుత తరుణంలో ఆ రోజుల్లో ఎన్నో చిత్రహింసలకు , అవమానాలకు గురైనప్పటికీ హిందూ ధర్మంలో ఉంటూ తను నమ్మిన ధర్మాన్ని వీడకుండా నేటితరం ఎంతోమందికి సంత్ రవిదాస్ ఆదర్శ ప్రాయుడని అన్నారు , వక్తలు మాట్లాడుతూ దళిత సోదరులు జన్మతః వచ్చిన హైందవ ధర్మాన్ని కాపాడడానికి పూనుకున్నప్పుడే హైందవ ధర్మం రక్షించబడుతుందని అన్నారు. అనంతరం చర్మకార వృత్తిని చేస్తూ ఎన్నో ఒత్తిడిలు , ప్రలోభాలు ఎదురైనప్పటికీ హిందూ ధర్మంలో కొనసాగుతున్న వినాయక రావు ని "సామాజిక సమరసత వేదిక" సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక జిల్లా సంయోజక్ గూడూరి సాంబమూర్తి తాడేపల్లిగూడెం మండల మహిళా సంయోజక్ శ్రీ లీల, సహా సంయోజక్ కాకరపర్తి మురళి సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు కిషోర్, బురిడి సతీష్ , అర్ ఆర్ ఎస్ ముఖ్య శిక్షక్ గణపతి రావు ప్రిన్సిపల్ గణపతి రామ్ మారిశెట్టి నరసింహమూర్తి, యెగ్గిన సాయి,
మానేపల్లి భార్గవ్ తదితరులు పాల్గొన్నారు

## నెల్లిపూడిలో పింఛన్ కార్యక్రమంలో పాల్గొన్న టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు శివ ప్రసాద్



**గంగవరం, పెన్ పవర్, జనవరి 31:**గంగవరం మండలం నెల్లిపూడి గ్రామంలో నిర్వహించిన పింఛన్ పంపిణీ కార్యక్రమంలో రంపచోడవరం నియోజకవర్గ టి ఎన్ ఎస్ ఎఫ్ అధ్యక్షుడు ముచ్చకర్ల శివ ప్రసాద్ పాల్గొన్నారు. గ్రామంలోని పింఛన్ లబ్ధిదారులను కలుసుకుని వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధులు, వికలాంగులు, విధవలకు పింఛన్ సేవలు మరింత సులభంగా అందేలా చూడాలని సూచించారు.పింఛన్ పొందుతున్న లబ్ధిదారులతో ఆయన నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. ప్రజలకు అందుతున్న సేవల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తెలియజేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ముంద్రు రాఘవరావు కుటుంబ సభ్యులను నీరుకొండ పరామర్శ..



**కోరుకొండ, పెన్ పవర్, జనవరి 31 :** భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు ముంద్రు రాఘవరావు ఇటీవల కన్నుమూసిన మూసారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులను శనివారం సాయంత్రం రాజానగరం నియోజకవర్గం భారతీయ జనతా పార్టీ మాజీ ఇంచార్జ్ నీరుకొండ వీరన్న చౌదరి, పరిమి రాధాకృష్ణ,మరియు తగరంపూడి గణపతి పరామర్శించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నీరుకొండ వీరన్న చౌదరి కుటుంబ సభ్యులకు వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. భారతీయ జనతా పార్టీలో ఆయన సేవలు పార్టీ క్రమశిక్షణ గల కార్యకర్తగా, నాయకుడిగా రాఘవరావు అందించిన సేవలను నేతలు స్మరించుకున్నారు. ఆయన మరణం పార్టీకి మాత్రమే కాకుండా ఈ ప్రాంతానికి కూడా పెద్ద లోటని వీరన్న చౌదరి కొనియాడారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఒకరోజు ముందుగానే అవ్వ తాతలకు పెన్షన్ అందించిన బొడ్డు..



**రాజానగరం,కోరుకొండ, పెన్ పవర్, జనవరి 31:** అవ్వ తాతలకు ఒకరోజు ముందుగానే తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, రుడా చైర్మన్,రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి పెన్షన్ అందించారు. శనివారం ఉదయం రాజానగరం లో తెలుగుదేశం పార్టీ నాయకులతో ఇంటింటికి వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని వారి చేతికి పెన్షన్ అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గంగవరం మండలం వైఎస్ఆర్సిపి మహిళ విభాగం అధ్యక్షురాలిగా బండారు రామలక్ష్మి



**గంగవరం, పెన్ పవర్, జనవరి 31**: గంగవరం మండలం వైఎస్ఆర్సిపి పార్టీ మహిళ విభాగం అధ్యక్షురాలిగా బండారు రామలక్ష్మిని పార్టీ అధిష్టానం నియమించింది. ఆమె చేసిన పార్టీ సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా బండారు రామలక్ష్మి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అవకాశం కల్పించిన ఎమ్మెల్సీ అనంత బాబు , రంపచోడవరం వైఎస్ఆర్సిపి పార్టీ ఇన్చార్జి నాగులపల్లి ధనలక్ష్మి , అలాగే గంగవరం మండల పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై పార్టీ బలోపేతానికి మరింత కట్టుబడి పనిచేస్తూ మహిళా విభాగాన్ని బలపర్చేందుకు కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ప్రజా సమస్యల పరిష్కారానికి సేవలందిస్తానని తెలిపారు.

## అంబటి రాయుడు ఇంటిపై జరిగిన దాడిపై మండిపడ్డ వడ్డి రఘురామ్.




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 31.** మాజీమంత్రి అంబటి రాయుడు ఇంటిపై జరిగిన దాడిపై మండిపడ్డారు తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు. ఆయన పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం వైస్సార్ సీపీ కార్యాలయం నుండి మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాలన అరాచక పరిపాలన చేస్తున్నారని మండిపడ్డారు. జగన్మోహన్ రెడ్డి మీద వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక అధికారన్నీ అడ్డుపెట్టుకుని వైసీపీ నాయకులను ఇబ్బందులు పెట్టడానికి చూస్తున్నారన్నారు. కలియుగ దైవం మీద అపహాస్యం చేసే విధంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని, దానికి వైసీపీ నాయకులు ఏమైనా చేసారా అంటూ ప్రశ్నించారు. ఈరోజు కూటమి ప్రభుత్వం వేసిన సిట్ మీద కూడా నమ్మకం లేదా అన్నారు. లడ్డులో కల్తీ లేదని సిట్ ఇచ్చిన రిపోర్టు మీద నమ్మకం లేదా అంటూ ఎద్దేవా చేశారు. ఈరోజు అంబటి రాయుడు నిజాలు మాట్లాడుతున్నారని ఆయన ఇంటి మీద దాడులు చేయడం హేయమైన చర్య అని దుయ్యబట్టారు. ఈరోజు చేస్తున్న చర్యకు ప్రతిచర్య ఉంటుందని ఈ కూటమి ప్రభుత్వం మర్చిపోకూడదన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు మా అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు ఎంతో సంయమనం పాటిస్తున్నారూ అంతే కాని చేతకాక కాదన్నారు. అంబటి రాయుడు ఒక కాపు సామాజిక వర్గమని, అంటే ఈ రాష్ట్రంలో ఉన్న కాపు సామాజిక వర్గానికి ఏమి మర్యాద ఇస్తున్నారన్నారు. రెడ్ బుక్ రాజ్యాంగం అంటూ ఇప్పుడు అదే అమలు చేస్తున్నారు. జగన్మోహన్ రెడ్డి గుడ్ బుక్ రాజ్యాంగం కావాలనే చెప్తున్నారన్నారు. ఈ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మీద పెరుగుతున్న వ్యతిరేకత చూసి, ఓర్వలేక పచ్చమూకలు దాడులకు పాల్పడుతున్నాయన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, ఆ కలియుగ దైవం చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు.

### ఇస్లామిక్ ధార్మిక సభను విజయవంతం చేయాలని ఇంచార్జ్ మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కి ఆహ్వానం.




**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 31.** ఫిబ్రవరి 14 , 15వ తేదీలలో తాడేపల్లిగూడెం నేషనల్ హైవే ఎంకే గ్రౌండ్స్ లో జరుగు ఇస్లామిక్ ధార్మిక సభను విజయవంతం చేయాలని ఇంచార్జ్ మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి ని భీమవరంలో కలిసి ఆహ్వానించారు. కార్యక్రమం గురించి గుంటూరు తూర్పు ఎమ్మెల్యే ఎండి నజీర్ గుంటూరు నుంచి వచ్చి శనివారం భీమవరం కలెక్టర్ ఆఫీస్ లో మంత్రిని కలిసి ఆహ్వానించారు .అనంతరం తాడేపల్లిగూడెం శాసనసభ్యులు శ్రీ బొలిశెట్టి శ్రీనివాస్ ని కలిసి ధార్మిక సభ గురించి వివరించడం జరిగింది పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ గారిని కలిసి వివరించడం జరిగింది .కార్మిక బోర్డు చైర్మన్ వలవల బాబ్జి తదితరులను కలిసి తాడేపల్లిగూడెంలో సభ విజయవంతవానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ల పంపిణీలో అలసత్వం వహించవద్దు అడ్డతీగల ఎంపీడీవో కుమార్...



అడ్డతీగల, పెన్ పవర్, జనవరి31: అడ్డతీగల మండలం వేటమామిడి గ్రామం లో శనివారం పెన్షన్ పంపిణీ నీ అడ్డతీగల ఎంపీడీవో కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు . సచివాలయ సిబ్బంది పెన్షన్ మొత్తం లో కోత ఏమైనా విధిస్తున్నారా,ఇంటికివచ్చి పెన్షన్ ఇస్తున్నారా,మర్యాదపూర్వకంగా మాట్లాడుతున్నారా అన్న వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు . సచివాలయం సిబ్బంది పెన్షన్ పంపిణీ ని శనివారం సాయంత్రానికి పూర్తి చేయాలని, ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే ఫిబ్రవరి 2 సోమవారం నాటికి పూర్తిచేయవలసినదిగా ఎంపీడీవో ఆదేశాలు జారీ చేశారు . వేటమామిడి గ్రామంలో సిబ్బందితో కలిసి పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు ఎంపీడీవో పెన్షన్ అందజేశారు. అడ్డతీగల మండలంమొత్తం 22 పంచాయితీలు 99 గ్రామాలకు మొత్తం పెన్షన్లు 5232 , శనివారం సాయంత్రానికి పంపిణీ చేసిన పెన్షన్లు మొత్తం 4432, మిగిలిన పెన్షన్లు మొత్తం ఫిబ్రవరి 2 వ తారీకు సాయంత్రానికి పూర్తిస్థాయిలో పంపిణీ జరగాలని,సిబ్బందికి ఎంపీడీవో ఆదేశాలు జారీ చేశారు.




## శ్రీవారి లడ్డుపై చేసిన దుష్ప్రచారనికి పరిహారంగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో పట్టణంలో వైఎస్సార్ సీపీ శ్రేణుల నిరసన ర్యాలీలు






**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. జనవరి 31.** చంద్రబాబు, పవన్ కళ్యాణ్ శ్రీవారి లడ్డుపై చేసిన దుష్ప్రచారనికి పరిహారంగా పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో నిరసనగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో పట్టణంలో పెద్దఎత్తున వైఎస్సార్ సీపీ శ్రేణుల నిరసన ర్యాలీ నిర్వహించారు. ఆలయంలో కొబ్బరికాయలు కొట్టిన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కలియుగ వెంకటేశ్వర స్వామి భక్తులకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలన్నారు. నోటికొచ్చినట్లుగా లడ్డులో పంది కొవ్వు కలిసిందని హిందువులు మనోభావాలు దెబ్బతినే విధంగా ఈ కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం అని మాట్లాడుతున్నారో సుప్రీం కోర్టు, సీబీఐ, సిట్ లడ్డులో ఏ కల్తీ లేదని రిపోర్ట్ ఇచ్చారో దానికి సమాధానం చెప్పాలన్నారు. మైలు అయిందంటూ గుడి మెట్లు కడిగిన పవన్ కళ్యాణ్ వెంటనే క్షమాపణలు చెప్పి మళ్ళీ రాష్ట్రంలో ఉన్న అన్ని దేవాలయాల మెట్లు కడగాలన్నారు. విష ప్రచారం చేసిన ఈ కూటమి నాయకుల భవిష్యత్తు ఎలా ఉండబోతుందో ఆ భగవంతుడు చూస్తాడన్నారు. ప్రపంచం వ్యాప్తంగా ఉన్న హిందువులు మనోభావాలు దెబ్బతీసే విధంగా ఈ కూటమి ప్రభుత్వం నీచ రాజకీయాలు చేసిందని మండిపడ్డారు. లడ్డులో ఎంత పవిత్రత ఉందో ఈరోజు తేటతెల్లం అయిందన్నారు. పాపం జరిగిందని ప్రజల్ని నమ్మించేందుకు ఆరోజు పవన్ కళ్యాణ్ దేవాలయం మెట్లు క్రింద నుండి పైకి కడిగారని, ఈరోజు అది అబద్ధం అని తేలింది కాబట్టి పైనుండి క్రిందకి పవన్ కళ్యాణ్ తిరుమల మెట్లు కడగాలన్నారు. జగన్మోహన్ రెడ్డి మీద వేసిన బురదని ఆ వెంకటేశ్వర స్వామి వారే కడిగేసారన్నారు. కూటమి నాయకులు చేసిన పాపానికి తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

# పులి సంచారం.. పల్లెల్లో అలజడి..

## రైతులు అప్రమత్తంగా ఉండాలి అటవీశాఖ అధికారులు హెచ్చరిక






**సీతానగరం, పెన్ పవర్, జనవరి: 31** సీతానగరం మండలంలోని చిన కోండేపూడి గ్రామ శివారులో గల పంట పొలాల్లో పెద్ద పులి సంచారం చేసినట్లు అడుగుజాడలను రైతులు గుర్తించారు. సమాచారం అందుకున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దావీదు రాజు బీట్ ఆఫీసర్లు జీవి రంగారావు శివాజీ ఘటన స్థలానికి చేరుకుని రైతులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన కొండేపూడి గ్రామానికి చెందిన గెడ్డం రామకృష్ణ వ్యవసాయ వరి పొలాల్లో పులి అడుగుజాడలను గుర్తించి వాటిని క్షణ్ణంగా పరిశీలించి ఇవి పెద్ద పులి అడుగుజాడలేనని వరి పొలంలో బురదలో అడుగుజాడలు కొంచెం పెద్ద సైజుగా ఉండడంతో పెద్దపులిగా భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ రాజమహేంద్రవరం డివిజన్ అధికారి దావీద్ రాజ్ మాట్లాడుతూఏలూరు ఫారెస్ట్ ఏరియా నుంచి వచ్చిందని పెద్దపులి ఫారెస్ట్ ఏరియాకు దగ్గరలో ఉందని తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సాయంత్రం వేళ పంట పొలాల్లో ఉండగా ఉండరాదని అన్నారు. అదేవిధంగా పంట పొలాల వద్ద ఉన్న పశువులను గ్రామాల్లోకి తీసుకువెళ్లాలని పెద్దకొండేపూడి చిన్న కొండేపూడి చీపురుపల్లి తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పంట పొలాల్లో పులి సంచరిస్తున్నట్లు తెలిస్తే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.




# జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

కాంగ్రెస్ పార్టీ సముద్రం లాంటిది

ఎవరు గ్రూపు వారిదే

-పార్లమెంట్ కో ఆర్డినేటర్ టీకే విశ్వేశ్వరరెడ్డి




**రాజమహేంద్రవరం , పెన్ పవర్, జనవరి 31**

తూర్పు గోదావరి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు దేశ ప్రధానిగా రాహుల్ గాంధీని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ షర్మిళారెడ్డిని చేసేవరకు కృషిచేస్తానని కాంగ్రెస్ రాజమహేంద్రవరం పార్లమెంట్ కో ఆర్డినేటర్ టీకే విశ్వేశ్వరరెడ్డి వెల్లడించారు. తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించిన ఎఐసిసి ముఖ్య నాయకులకు, పిసిసి అధ్యక్షురాలు షర్మిళకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక మున్సిపల్ కాలనీలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో టీకే మాట్లాడుతూ రాజమండ్రి పార్లమెంట్ పాటు అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. త్వరలోనే అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తామని, ఘర్ వాపస్ ఆవో నినాదంతో గతంలో పార్టీలో పదవులు పొంది, లబ్ధి పొందిన మాజీ నాయకులు ఉండవల్లి అరుణ్ కుమార్, రౌతు సూర్యప్రకాశ్రావు, శివరామ సుబ్రహ్మణ్యం వంటి వారిని మళ్లీ సొంత గూటికి రప్పిస్తామని తెలిపారు. తనకు అండగా నిలిచిన కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండి రఫీబెగ్ ఆయనకు నియమాకపత్రం అందించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, పిసిసి ఉ పాధ్యక్షుడు మార్టిన్ లూథర్, రాష్ట్ర ప్రచార కమిటీ చైర్మన్ డాక్టర్ వడయార్, మహిళా విభాగం అధ్యక్షురాలు మోతా శారద, కాకర్ల హరిబాబు, మట్టా శ్రీనివాస్ గౌడ్ తదితర నాయకులు దుశ్శాలువాలతో టీకే విశ్వేశ్వరరెడ్డిని సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సింధియా రాణికి నియామక పత్రం అందచేసారు. పలువురు నాయకులు మాట్లాడుతూ, గడచిన 18 నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి విశ్వేశ్వర రెడ్డి శ్రమించారన్నారు. ఆయన నాయకత్వాన్ని బలపరుస్తూ తాము పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిళకు విన్నవించగా పార్లమెంట్ కో ఆర్డినేటర్ గా పదవి అప్పగించారన్నారు. ఫిబ్రవరి 2వ తేదీ నాటికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించి 20 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా షర్మిళారెడ్డి ఉపాధి హామీ పథకం పరిరక్షణ యాత్ర చేపడుతున్నారని, తాము మద్దతిస్తున్నామన్నారు. జిల్లా కమిటీ ఏర్పాటుచేసి కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్ని సమన్వయం చేసే చర్యలు తీసుకుంటామన్నారు.

**కాంగ్రెస్ పార్టీ లో గ్రూపులు, ముఠాలు మామూలే...**

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఉనికే లేని సమయంలో రాజమండ్రిలో పార్టీలో రెండు, మూడు గ్రూపులు ఉన్న క్రమంలో వారిని సమన్వయం చేసుకుని పని చేస్తారా అన్న ప్రశ్నకు టికే బదులిస్తూ, కాంగ్రెస్ పార్టీ అంటే సముద్రం లాంటిదని గ్రూపులు, ముఠాలు మామూలేనని, ఎవరి గ్రూపు వారిదేనన్నారు. ఆనాటి ఏ సి వై రెడ్డి నుండి ఈనాటి వరకు ఎన్నో గ్రూపులు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సాకా పుల్లారావు, డాక్టర్ వడయార్ శ్రీనివాస్, కాకర్ల హరిబాబు, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ యాళ్ల వీరభద్రరావు, జి. రామకృష్ణ, , రాయపూడి శ్రీదేవి, షేక్ జయలలిత, మండూరి ఎస్తేర్, కె. గ్రేస్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల సృజనాత్మకత, విమర్శాత్మక ఆలోచనకు అద్దం పట్టిన సాట్ ప్రదర్శన






**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 31::** స్థానిక సాటిలైట్ సిటీ గ్రామ సమీపంలో ఉన్న ఫీనిక్స్ గ్లోబల్ స్కూల్ ఆధ్వర్యంలో ఫీనిక్స్ సైన్స్, ఆర్ట్స్ అండ్ టెక్నాలజీ డే 2026 కార్యక్రమం శనివారం పాత స్కూలు ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న విద్యార్థుల సృజనాత్మకత, విమర్శాత్మక ఆలోచన, భవిష్యత్‌కు అవసరమైన నైపుణ్యాలను ప్రతిబింబించే విధానం ఆకట్టుకుంది.

ఈ కార్యక్రమానికి సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్, పేరెంట్ కౌన్సిలర్ అభిషేక్ సింగంసెట్టి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు విద్యతో పాటు మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం ఎంతో ముఖ్యమని తెలిపారు.

విద్యార్థులతో, తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సంభాషించిన ఆయన, చిన్న వయసులోనే భావోద్వేగ సమతుల్యత, నిర్ణయ సామర్థ్యం, నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. పాఠ్యాంశాలకు మించి జీవిత నైపుణ్యాలపై దృష్టి పెట్టే విధానం ప్రశంసనీయమన్నారు.

విద్యార్థులు సైన్స్, ఆర్ట్స్, టెక్నాలజీ విభాగాల్లో రూపొందించిన గ్రూప్ ప్రాజెక్టులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈ ప్రదర్శనలు విద్యార్థుల ఆలోచనా శక్తి, జట్టు సమన్వయం, సమస్యల పరిష్కార నైపుణ్యాలను ప్రతిబింబించాయి.

ఈ కార్యక్రమం ఫీనిక్స్ ఐడియాలజీకి అనుగుణంగా నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం, భావోద్వేగ మేధస్సు, గ్లోబల్ స్కిల్స్‌ను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించామని స్కూలు యాజమాన్యం తెలిపింది. ఫీనిక్స్ ఎస్ఏటి--2026 విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా ప్రాయోగికంగా నేర్చుకున్న జ్ఞానాన్ని ప్రదర్శించే వేదికగా నిలిచింది. భవిష్యత్‌కు అవసరమైన నైపుణ్యాలు, విలువలు, బాధ్యతాయుతమైన దృక్పథం కలిగిన పౌరులను తీర్చిదిద్దాలన్న సంకల్పంతో కార్యక్రమం ముగిసింది.

## నిరుపేదలకు ఎన్టీఆర్ భరోసా ఒక వరం

-మాజీ జెడ్పిటిసి కన్యకా పరమేశ్వరి



**కూనవరం,పెన్ పవర్,జనవరి 31.** నిరుపేదలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ ఒక వరమని మాజీ జెడ్పిటిసి ఎడవల్లి కన్యకా పరమేశ్వరి అన్నారు.మండల కేంద్రంలోని సచివాలయం సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి పరమేశ్వరి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేశారు.ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయడంలో ముందున్నారని,పేద ప్రజల సంక్షేమం నాకు దైవంతో సమానమని ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టే ముందు అన్నారని గుర్తు చేశారు.ఒకటవ తారీకు ఆదివారం రావడంతో ఒకరోజు ముందుగా పెన్షన్ ఇవ్వటం జరుగుతుందని అన్నారు. వృద్ధులకు,వితంతువులకు,ఒంటరి మహిళలకు 4వేలు,వికలాంగులకు 6వేలు,క్యాన్సర్,డయాలసిస్ పేషెంట్లకు 10వేలు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు.ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమాన్ని మండలంలో ఒక పండుగల కూటమి నాయకులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు,ప్రజా ప్రతినిధులు,కూటమి నాయకులు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం పాలన అరాచక పరిపాలన

# బొమ్మూరులో జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం భవనానికి శంఖుస్థాపన



- ఆరు పంచాయతీలకు స్వచ్ఛ ఈ ఆటో రిక్షాలు ప్రారంభం
- ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

**రాజమహేంద్రవరం పెన్ పవర్, జనవరి 31:** గ్రామ పాలనను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా తూర్పు గోదావరి జిల్లా, రాజమహేంద్రవరం రూరల్ మండలం, బొమ్మూరు గ్రామంలో జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం భవన నిర్మాణానికి రాజమహేంద్రవరం రూరల్ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి శంఖుస్థాపన చేశారు

శనివారం బొమ్మూరు గ్రామంలో జిపిఆర్ లే అవుట్ లో డీపీఆర్సి భవన శంఖు స్థాపన, ఈ ఆటో రిక్షాలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, గ్రామ పంచాయతీల సామర్థ్యాన్ని పెంపొందించడంలో ఈ శిక్షణ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

. కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ నుంచి రెండు కోట్ల రూపాయల నిధులతో ఈ భవన నిర్మాణాన్ని చేపడుతున్నట్లు, తొమ్మిది నెలల కాలంలో పూర్తి చేయాలన్నారు. బాలాజీ పేట నుంచి రాజవోలు వరకు రహదారి అభివృద్ధి పనులకు సుమారు రూ.3.50 కోట్ల వ్యయం అవుతుందని ఫిబ్రవరి 2 న రహదారి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటించారు. బొమ్మూరు గ్రామ పరిధిలో రూ.8.50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతు న్నాయన్నారు. ఎన్నికల నిర్వహణ లేక పోవడం వల్ల 15వ ఆర్థిక సంఘం నుంచి నిధులు రావడం లేదన్నారు.జిల్లా పరిషత్ నుంచి కొంత నిధులు విడుదల చెయ్యాలనీ, జల జీవన్ మిషన్ పనులలో భాగంగా పైపులు మాత్రమే వేసి, మిగిలిన పనులు గత ప్రభుత్వం పూర్తి చేయని కారణంగా రాష్ట్రానికి రూ.27 వేల కోట్ల నష్టం జరిగిందన్నారు. కూటమి ఆధ్వర్యం లోని రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి వల్ల వాటర్ గ్రిడ్ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.12 వేల కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో డ్రెయిన్ల సమస్య తీవ్రంగా ఉందని, ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. డ్వాక్రా సంఘాలను గ్రామ పంచాయతీ పరిధిలోకి తీసుకురావాలనే మహిళల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుంటామన్నారు. రాబోయే మూడు నాలుగు నెలల్లో ఎన్నికలు జరిగే విధంగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రూరల్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు పెన్షన్ల కోసం రూ.247 కోట్ల నిధులు ఖర్చు చేశామన్నారు. ఈ నెలలో 44 మందికి కొత్త పెన్షన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలో కొందరు సిబ్బంది సక్రమంగా పని చేయడం లేదని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు పన్నులు చెల్లించి అభివృద్ధి లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ-ఆటోల పంపిణీ కార్యక్రమాన్ని రూరల్ శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో సీతానగరం మండలం మునికూడలి, రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవలేశ్వరం గ్రామీణం, గోకవరం మండలం గుమ్మలదొడ్డి, రాజానగరం మండలం దివాన్చెరువు గ్రామ పంచాయితీలకు, కోవ్వూరు డివిజన్ పరిధిలో దేవరపల్లి మండలం దుమ్మంతునిగూడెం, చాగల్లు మండలం మార్కొండపాడు, తాళ్లపూడి మండలం బల్లిపాడు గ్రామ పంచాయితీలకు ఈ-ఆటోలు కేటాయించటం జరిగిందన్నారు. గ్రామాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ బలోపేతం కావడంతో పాటు పరిశుభ్రమైన పరిసరాలు ఏర్పడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ సూపరింటెండింగ్ ఇంజినీర్ కె. బాలకృష్ణ, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి వి. శాంత మణి, ఎంపిడిఓ ఎం. ఆర్మ్ స్ట్రాంగ్, గ్రామ సర్పంచ్ , స్థానిక ప్రజాప్రతినిధులు మత్సేటి ప్రసాద్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు యేసు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దోసకాయలపల్లి గ్రామంలో అవ్వ తాతలకు పెన్షన్ పంపిణీ..

తెలుగుదేశం పార్టీ నాయకులు మార్ని రాము..



**కోరుకొండ, పెన్ పవర్, జనవరి 31:** దోసకాయలపల్లి గ్రామంలో శనివారం ఉదయం అవ్వ, తాతలకు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మార్ని రాము పెన్షన్ అందజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఎన్నికల ముందు ఏదైతే హామీ ఇచ్చారో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అవ్వ తాతలకు ఒకేసారి వేయి రూపాయలు పెంచి నాలుగువేల రూపాయలు ఇస్తున్నారు. ఒకరోజు ముందుగానే అవ్వ తాతలకు ఇంటికి వెళ్లి పెన్షన్ అందించడం చాలా ఆనందంగా ఉందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో దోసకాయలపల్లి సొసైటీ చైర్మన్ సూదిన గంగాధర్, మార్ని బుజ్జి, తెలుగుదేశం పార్టీ నాయకులు సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నారాయణపురం డిగ్రీ కళాశాలలో పీఎం ఉషా స్కీమ్ కింద 10 రోజుల పైథాన్ సర్టిఫికెట్ కోర్సు ముగింపు



**పెన్ పవర్, ఉంగుటూరు, జనవరి 31:** నారాయణపురంలోని శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీఎం ఉషా స్కీమ్‌లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన 10 రోజుల పైథాన్ సర్టిఫికెట్ కోర్సు శిక్షణ శనివారం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సమావేశానికి కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డి. రెడ్డయ్య అధ్యక్షత వహించారు.

ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ద్వారా విద్యార్థులకు నాణ్యమైన, విలువైన విద్య అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. ఇటువంటి శిక్షణా అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ నౌ గ్రూప్ ఆఫ్ కంపెనీల అధిపతి మనోజ్ కుమార్ సోంకార్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి పుట్టుకతోనే శక్తివంతుడేనని అన్నారు. ప్రపంచం శరవేగంగా మారుతున్న తరుణంలో, ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తమ ఆలోచన విధానాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కష్టపడి పని చేయడం ద్వారానే ప్రపంచంలో గొప్ప వ్యక్తులుగా ఎదగగలమని, నిరంతర శ్రమనే విజయానికి మూలమని తెలిపారు.స్నేహితులు ఏం చేస్తున్నారనే దానిపై కాకుండా, తమ ఆలోచనలు, అభిరుచులకు ప్రాధాన్యతనిచ్చి, ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని నిబద్ధతతో పని చేస్తే విజయాలు సాధించవచ్చని ఆయన విద్యార్థులకు సూచించారు.

## శిక్షణ పోలీస్ కానిస్టేబుళ్ల కు ఎన్ డి పి ఎస్ చట్టం పై అవగాహన సదస్సు





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జనవరి 31:** తూర్పు గోదావరి జిల్లా నాలుగవ బెటాలియన్ ఏపీఎస్పీ నందు ట్రైనింగ్ సెంటర్ లో శిక్షణ పొందుతున్న స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల కు ఎన్ డి పి ఎస్ చట్టం పై అవగాహన సదస్సును ఈగల్ ఐ జి పి ఆకే. రవికృష్ణ నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈగల్ ఐ జి కి, కమాండెంట్ నాలుగవ ఐ ఆర్ బెటాలియన్ ఏపీఎస్పీ పి. సత్తిబాబు, ఇతర పోలీస్ అధికారులు ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఈగల్ ఐజి రవికృష్ణ మాట్లాడుతూ, కష్టపడి చదివి, శారీరక పరీక్షలు, రాత పరీక్షలు విజయవంతంగా పూర్తి చేసి ఈ స్థాయికి చేరుకున్నందుకు శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖలో ఉద్యోగం రావడం అదృష్టమని, ఉద్యోగం పట్ల అంకితభావం, క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. శిక్షణ అనంతరం ప్రజలకు మెరుగైన సేవలు అందించి, పోలీస్ శాఖ పై గౌరవం మరింత పెంచాలన్నారు . శిక్షణా కేంద్రాలలో, శిక్షణను ఆటంకాలు లేకుండా విజయవంతంగా పూర్తి చేసుకోవాలని ఆశించారు.

డ్రగ్స్ దుర్వినియోగం గురించి గంజాయి వంటి మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్పరిణామాలు, శారీరక, మానసిక ఆరోగ్యంపై వచ్చే ప్రభావం, నేరచరిత్రపై పడే ప్రభావాలు వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.

డ్రగ్స్ అడిక్షన్ అనేది ఆరోగ్య సమస్య మాత్రమే కాదని, జాతీయ భద్రత అంశం అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా గంజాయి నిర్మూలనకు ఆంధ్రప్రదేశ్ డి.జి.పి.హరీశ్ కుమార్ గుప్త ఆదేశాల మేరకు అంతర్రాష్ట్ర చెక్పోస్టులను ఏర్పాటు చేసి నిత్యం వాహన తనిఖీలు, విస్తృతంగా కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు, అవగాహన కార్యక్రమాలు, డ్రోన్ నిఘా చేస్తున్నామన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో సైకిల్ తొక్కు బ్రో, ఆపరేషన్ గరుడ, ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ వంటి కార్యక్రమాలు చేపట్టి గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.డ్రగ్స్ నిర్మూలన క్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు అవ్వాలని అన్నారు.

గంజాయి సంబంధిత కదలికలపై ఎటువంటి సమాచారమున్నా వెంటనే 1972 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారమివ్వమని, వారి వివరములను గోప్యంగా ఉంచుతామ న్నారు. అనంతరం ట్రైనీ కానిస్టేబుల్స్ చేత డ్రగ్స్ పైన ప్రతిజ్ఞ చేయించి, డ్రగ్స్ వద్దు బ్రో నినాదం చేయించారు.

ఈ కార్యక్రమంలో ఈగల్ తూర్పుగోదావరి జిల్లా ఇన్స్పెక్టర్ పి.వి. సూర్య మోహన్ రావు, ట్రైనీ సీఐ జి వెంకటేశ్వరరావు ఈగల్ సిబ్బంది పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## ఆర్థిక సహాయం అందజేసిన వంటిపల్లి సతీష్



**ఆలమూరు, పెన్ పవర్, జనవరి 31;**మండల కేంద్రమైన ఆలమూరు గ్రామానికి చెందిన బుంగ కిట్టయ్య భార్య నాగమణి (60) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. ఫిబ్రవరి 1వ తేదీన అందించవలసిన పెన్షన్ డబ్బులు నేడు ఆదివారం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు ముందుగానే పంపిణీ చేస్తున్నారు.ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు గ్రామ సచివాలయం సిబ్బంది శనివారం తెల్లవారుజాము నుంచే స్థానిక కూటమి నాయకులతో కలిసి ఇంటింటికి తిరుగుతూ లబ్ధిదారులకు అందజేస్తున్నారు. ఇదే తరుణంలో నాగమణి పెన్షన్ డబ్బులు అందుకోవాల్సి ఉండగా తెల్లవారుజామునే మృతి చెందారు.కుటుంబ సభ్యుల ఆర్థిక స్థితిగతులు అంతంత మాత్రమే. అయితే విషయం తెలుసుకున్న తెలుగు దేశం పార్టీ కోనసీమ జిల్లా పార్లమెంట్ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి, సీనియర్ నాయకుడు, పిఏసిఎస్ అధ్యక్షుడు వంటిపల్లి సతీష్ కుమార్ ఆమె దశదినకర్మకు 4 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. తెలుగుదేశం పార్టీ పేదలకు ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో లంక వినయ్ కుమార్,వేమగిరి సతీష్,తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడలో స్కూల్ పిల్లలను అధికంగా తరలిస్తున్న ఆటోలపై స్పెషల్ డ్రైవ్

నిబంధనలు ఉల్లంఘించిన ఆటోలను ఆర్‌టీఓ అధికారులకు అప్పగించిన ట్రాఫిక్ పోలీసులు





**కాకినాడ పెన్ పవర్,జనవరి 31:**కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు, ఏఎస్పీ దేవరాజ్ మనీష్ పాటిల్ పర్యవేక్షణలో ట్రాఫిక్ పోలీసులు స్కూల్ పిల్లలను, ప్రయాణికులను పరిమితికి మించి తరలిస్తున్న ఆటోలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.ఈ సందర్భంగా నిబంధనలు అతిక్రమించిన ఆటోలను ట్రాఫిక్--1 పోలీస్ స్టేషన్‌కు తరలించి, జిల్లా ఎస్పీ సూచనల మేరకు ఆటో డ్రైవర్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు.అనంతరం సంబంధిత వాహనా లను రోడ్డు రవాణా శాఖ అధికారులకు తదుపరి చర్యల కోసం అప్పగించారు.డ్రైవర్లకు ఇచ్చిన కీలక సూచనలుట్రాఫిక్ అవగాహన కార్యక్రమంలో ఆటో డ్రైవర్లకు ఈ సూచనలు చేశారు.ఆటోల్లో 3ం1 పరిమితికి మించి ప్రయాణికులను, 6ం1 కంటే ఎక్కువగా స్కూల్ పిల్లలను ఎక్కించరాదని.ఆటో కుడివైపు భాగాన్ని ఐరన్ గ్రిల్స్‌తో పూర్తిగా క్లోజ్ చేయాలని.స్కూల్ ఆటోల బయట భాగాల్లో బ్యాగులు వేలాడ దీయరాదని.వెనుక డోర్ ఓపెన్ చేసి ప్రయాణికులను కూర్చో బెట్టరాదని. డ్రైవర్‌కు ఎడమ, కుడి వైపుల ప్రయాణి కులను కూర్చోబెట్టుకొని వాహనం నడపరాదని.డ్రైవింగ్ సమయంలో తప్పనిసరిగా యూనిఫారం ధరించి డ్రైవింగ్ లైసెన్స్,వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలని.వాహనాన్ని ఎక్కడపడితే అక్కడ నిలపరాదని, మితిమీరిన వేగంతో నడపరాదని. ప్రభుత్వం జారీ చేసిన నెంబర్ ప్లేట్లు మాత్రమే వాడాలని. ఆటోకు ఇరువైపులా సైడ్ మిర్రర్లు తప్పనిసరిగా ఉండాలని.ఆటోల పర్మిట్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్, పొల్యూషన్ సర్టిఫికెట్‌లు, డ్రైవింగ్ లైసెన్సుల తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. అధికారుల పాల్గొనడంఈ కార్యక్రమంలో ట్రాఫిక్--1 సీఐ ఎన్. రమేష్, 1 టౌన్ సీఐ నాగ దుర్గారావు, 3 టౌన్ సీఐ సత్యనారాయణ,పోర్ట్ సీఐ సునీల్ కుమార్, ఆర్‌టీఓ అధికారులు హరినాథ్ రెడ్డి, గౌరీ శంకర్, ట్రాఫిక్--1 పోలీసులు, ఎస్ఐ శంకర్, పి. కిషోర్ కుమార్, సీహెచ్ కిషోర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.?

## రామచంద్రాపురంలో భారీ అన్నదానం.

-ముఖ్యఅతిథిగా పాల్గొన్న తుమ్మలపల్లి సాయిచందు



**కిర్లంపూడి, పెన్ పవర్, జనవరి 31:**కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామంలో వేంచేసియున్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద శనివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.సర్పంచ్ తుమ్మలపల్లి సాయిగుణ శేఖర్, ఆలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహా అన్నదాన కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రోగ్రమింగ్ కమిటీ వైస్ చైర్మన్ తుమ్మలపల్లి సాయిచందు పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు.ముందుగా తుమ్మలపల్లి సాయిచందు ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తామరాడ ఎంపీటీసీ గోకేడ రాజా, రేవూరి శ్రీను, కొలమూరు బుజ్జి, కాయల మణికంఠ, పాలెం బాబీ, ఆలయ కమిటీ మరియు తదితరులు పాల్గొన్నారు

## ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి.



మేనేజర్ కిషోర్.

**గోపాలపురం, పెన్ పవర్, జనవరి 31.**బ్యాంకుఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని గోపాలపురం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ మేనేజర్ కిషోర్ అన్నారు. బ్యాంకులో ఉద్యోగిగా సుదీర్ఘకాలం పనిచేసిన ఎండి నజీర్ శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది నజీర్ సహేరా దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ వినియోగదారుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు పనిచేయవలసిన అవసరం ఉందన్నారు. నజీర్ సుదీర్ఘ కాలం పాటు పనిచేసి ఉన్నతాధికారులు, వినియోగదారుల పొందారని కొనియాడారు. ఏ ప్రభుత్వ ఉద్యోగి అయిన పదవి విరమణ చేయవలసింది అన్నారు. ప్రతి ఒక్కరు ఉద్యోగిగా ఉత్తమ సేవలు ఉత్తమ సేవలు అందించాలన్నారు. 24 ఏళ్లు ఉద్యోగ పనిచేసిన నజీర్ శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సబ్ మేనేజర్ లావణ్య, క్యాషియర్లు వై వెంకటేశ్వరరావు, కే రమణ, అనుపోజు రాంబాబు, సాగర్, బ్యాంకు ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## వర్జీనియా పొగాకు తోటల పరిస్థితి ఏమిటి?





**గోపాలపురం, పెన్ పవర్, జనవరి 31.**మెట్ట ప్రాంతంలోని వేలాది ఎకరాల్లో రైతులు వర్జీనియా పొగాకు పంటను దశాబ్దాల తరబడి సాంప్రదాయ బద్ధంగా సాగు చేస్తున్నారు. అంతర్జాతీయ వాణిజ్య పంట అయిన ఈ పొగాకును పసుపు బంగారంగా ముద్దుగా పిలుస్తారు. అత్యంత ఖరీదైన పంటగా పేరుగాంచిన పొగాకు పంట రైతులకు తీరని నష్టాన్ని చేకూర్చిందని వారు గగ్గోలు పెడుతున్నారు. గత ఏడాది పొగాకు గిట్టుబాటు ధర లేక రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో కిలో పది నుండి 20 రూపాయలకు విక్రయించుకునే దుస్థితి నెలకొంది. నాసిరకం పొగాకును వేలం కేంద్రం అధికారులు కొనుగోలు చేయడానికి తిరస్కరించడంతో రైతులు బహిరంగ మార్కెట్లో ప్రైవేటు వ్యక్తులకు వచ్చిన ధరకు అమ్ముకున్నారు. ఏడాది అయిన పొగాకు పంట పరిస్థితి బాగుంటుందని భావించారు. అయితే ఆదిలోనే హంసపాదు అన్న చందంగా తయారయింది. ఈ ఏడాది ప్రారంభంలో వరస తుఫానులు, భారీ వర్షాలు కారణంగా పొగాకు నాట్లు వేయడానికి వాతావరణం అనుకూలంగా లేకుండా పోయింది. దీనితో నాట్లు వేయడం ఆలస్యం అయ్యింది. దానికి తోడు మొక్క దశలోనే తెగుళ్ల బారిన పడ్డాయి. ట్రేలలో ఉన్న మొక్కలకు సైతం మానుమచ్చ, మొదళ్లు కుళ్ళు వంటి వ్యాధులు చోకాయి.
మొక్క నాటిన పది రోజులకి అవి మృత్యువాత పడడం మొదలుపెట్టాయి. రైతులు చేసేది లేక మళ్ళీ నారు తెచ్చి నాట్లు వేశారు. కొందరు రైతులు నాట్లు వేసిన తోటలను దున్నివేసి మళ్లీనాట్లు వేశారు. అనంతరం వాతావరణంలో మళ్లీ మార్పులు వచ్చి వర్షాలు రావడంతో పంటను పురుగు ఆశించింది. మందులు పిచికారి చేసి పంటను రక్షించుకున్నారు. వాస్తవానికి ప్రతి ఏటా డిసెంబర్ చివరి వారంలో పొగాకు రెలుపులు మొదలవుతాయి. ఈ ఏడాది నాట్లు ఆలస్యంగా వేసిన కారణంగా ఇంకా తోటలు పెరగక రెలుపులు ప్రారంభం కాలేదు. డిసెంబర్ చివరివారంలో రెలుపులు ప్రారంభమైతే మార్చి నెలలో ముగిసేవి. ప్రస్తుతం ఫిబ్రవరి నెలలో ప్రారంభం కానున్న నేపథ్యంలో మే నెల వరకు తోటల రేల్పులు ఉండే అవకాశం ఉంది. అయితే వేసవిలో ఎండలు విపరీతంగా కాయడం వల్ల ఆకులు తత్వానికి రాకుండానే పండిపోయే అవకాశం ఉంది. దీంతో పొగాకు నాణ్యత దిగుబడి తగ్గి పోతుంది. ఈ నేపథ్యంలో రైతులకు విపరీతమైన నష్టం వస్తుంది. 2024లో పొగాకు రికార్డు స్థాయిలో ధర పలికింది. నాణ్యతలేని పొగాకు సైతం కిలో 250 రూపాయలు ధర రావడంతో రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. వచ్చే ఏడాది కూడా ధర అలాగే ఉంటుందని ఉద్దేశంతో రైతులు రెట్టించిన ఉత్సాహంతో పంటను సాగు చేశారు. కానీ రైతుల ఆశలు అడియాసలయ్యాయి. చివరిలో పొగాకు కొని నాథుడే కొరువయ్యాడు. నాణ్యమైన నెంబర్ వన్ పొగాకు తప్ప మిగిలిన పొగాకు ను రైతులు వేలం కేంద్రంలో విక్రయించలేకపోయారు. చేసేదిలేక ఆ పొగాకును అందిన గాడికి బహిరంగ మార్కెట్లో అమ్ముకొని సొమ్ము చేసుకున్నారు. అయితే ఈ ఏడాది పొగాకు ధర ఎలా ఉంటుంది అని రైతులు గంపెడు ఆశతో ఎదురుచూస్తున్నారు. సిగరెట్లు పై సుంకం అధికంగా విధించడం వల్ల పంట దెబ్బతింటుందని కొనడానికి వ్యాపారులు ముందుకు రారని రైతులు కొన్ని చోట్ల ధర్నాలు చేస్తున్నారు. మరి కొందరు సమస్యని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ఈ నేపథ్యంలో ఏడాది పొగాకు ధర ఎలా ఉంటుందో వేచి చూడవలసింది.

## క్రమ శిక్షణతో విద్యను అభ్యసించాలి- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి





**గంగవరం పెన్ పవర్ జనవరి 31:** బాలికలు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, పాఠశాలలో, వసతి గృహాల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహాన్ని, పాఠశాల ను పరిశీలించారు. . బాలికలకు అందిస్తున్న సౌకర్యాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. వసతి సదుపాయిలు, తాగునీటి సమస్య, మరుగుదొడ్లు నిర్వహణ, భోజన వసతి, బాలికల ఆరోగ్య పరిస్థితులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తొలిసారిగా పాఠశాలకు విచ్చేసిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ బొజ్జిరెడ్డి నీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఝాన్సీరాణి, డిప్యూటీ వార్డెన్ మడకం లావణ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సన్మానించారు, పీడీ చిన్నపాప. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నిరుపేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వానికి తొలి ప్రాధాన్యం

దేశానికే ఆదర్శంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ: ఎమ్మెల్యే బండారు

**రావులపాలెం మండలం, జనవరి 31:**నిరుపేదల సంక్షేమానికి తొలి ప్రాధాన్యం -- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
దేశానికే ఆదర్శంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ
భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ అమలుకాని సంక్షేమ పథకాలను మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.
శనివారం రావులపాలెం మండలం కొమరాజులంక గ్రామంలో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు. గ్రామంలో లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి వారికి పింఛన్లను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి నెలా పింఛన్లు సకాలంలో అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఆదివారం వస్తే ఒకరోజు ముందుగానే పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. సంక్షేమంతో పాటుఅభివృద్ధిలోనూ రాష్ట్రం వేగంగా ముందుకు సాగుతోందని చెప్పారు.
కొత్తపేట నియోజకవర్గంలో మొత్తం 42,069 మందికి సామాజిక, ఆర్థిక భద్రత కల్పించే విధంగా పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. ఇందుకోసం నియోజకవర్గ వ్యాప్తంగా రూ.18 కోట్ల 30 లక్షల 30 వేల రూపాయల పింఛన్ల పంపిణీ జరుగుతోందని వివరించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల విజేత రైబాకినా..

# ఫైనల్లో సబలెంకాపై థ్రిల్లింగ్ విక్టరీ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియన్ ఓపెన్ టెన్నిస్ మహిళల విజేతగా ఎలెనా రైబాకినా నిలిచింది. మెల్‌బోర్న్‌లో శనివారం (జనవరి 31) జరిగిన మ్యాచ్ లో ప్రపంచ నంబర్ వన్ అరీనా సబలెంకాను ఓడించి టైటిల్ తమ ఖాతాలో వేసుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్లో రైబాకినా 6-4, 4-6, 6-4 తేడాతో ఓడించి తొలి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. మూడేళ్ల క్రితం 2023లో జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో సబలెంకా చేతిలో ఓడిపోయిన రైబాకినా తాజా విజయంతో ప్రతీకారం తీర్చుకుంది. రైబాకినాకు ఇదే తొలి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ కావడం విశేషం. 2023 ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో రైబాకిన తొలి సెట్ గెలిచి ఆ తర్వాత వరుసగా రెండు సెట్లలో సబలెంకా చేతిలో ఓడిపోయింది. 2026 ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో కూడా అదే సీన్ రిపీట్ అయ్యేలా కనిపించింది. తొలి సెట్ ను రైబాకిన చాలా కూల్ గా 6-4తో గెలుచుకుంది. అయితే రెండో సెట్ లో మాత్రం సబలెంకా ధాటికి వెనకబడి పోయింది. ఈ నెంబర్ వన్ సీడ్ హార్డ్ హిట్టింగ్ దెబ్బకు రైబాకిన వద్ద సమాధానం లేకుండా పోయింది. కీలకమైన సమయంలో సర్వీస్ కోల్పోయి సెట్ ను 3-6 తేడాతో చేజార్చుకుంది. నిర్ణయాత్మక మూడో సెట్ ప్రారంభంలో అంతా సబలెంకా హవా కొనసాగింది. తన సర్వీస్ ను నిలుపుకోవడంతో పాటు రెండో గేమ్ లో రైబాకిన సర్వీస్ ను బ్రేక్ చేసి 2-0 ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత తన సర్వీస్ నిలుపుకొని 3-0 ఆధిక్యంలోకి వెళ్ళింది. ఈ సమయంలో సబలెంకా విజయం ఖాయమని చాలామంది భావించారు. అయితే ఇక్కడ నుంచి రైబాకిన షో స్టార్ట్ అయింది. తన సర్వీస్ ను నిలుపుకొని తొలి గేమ్ గెలిచిన ఈ కజకిస్తాన్ ప్లేయర్ ఆ తర్వాత టాప్ లెవల్ ఆట తీరుతో చెలరేగిపోయింది. వరుసగా ఐదు గేమ్ లు గెలిచి 5-3 ఆధిక్యంలోకి వెళ్ళింది. తన సర్వీస్ ను జాగ్రత్తగా నిలుపుకొని మ్యాచ్ తో పాటు టైటిల్ కూడా గెలుచుకుంది.

# వరల్డ్ కప్ సెమీస్‌లో ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, ఆఫ్ఘనిస్తాన్.. టీమిండియా పరిస్థితి ఏంటి..?




**హైదరాబాద్ పెన్ పవర్:** అండర్-19 వరల్డ్ కప్ లో భాగాంగా ఇప్పటికే మూడు జట్లు సెమీ ఫైనల్ కు అర్హత సాధించాయి. గ్రూప్ లో ఆస్ట్రేలియా, ఆఫ్ఘనిస్తాన్ తో పాటు గ్రూప్-బి లో ఇంగ్లాండ్ ఇప్పటికే సెమీస్ కు చేరుకున్నాయి. గ్రూప్ ఏ లో ఆస్ట్రేలియా ఆడిన నాలుగు మ్యాచ్ ల్లో విజయం సాధించింది. మరోవైపు ఆఫ్ఘనిస్తాన్ ఆడిన నాలుగు మ్యాచ్ ల్లో మూడు విజయాలతో సెమీస్ బెర్త్ కన్ఫర్మ్ చేసుకుంది. మరోవైపు గ్రూప్ బి లో ఇంగ్లాండ్ ఆడిన నాలుగు మ్యాచ్ ల్లో గెలిచి సెమీస్ కు చేరుకుంది. గ్రూప్ బి లో ఇండియా లేదాపాకిస్థాన్ జట్లలో ఒక జట్టే సెమీస్ కు చేరే అవకాశం ఉంది. అండర్-19 వరల్డ్ కప్ సూపర్ సిక్స్ లో భాగంగా ఇండియా ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్ ల్లో విజయం సాధించింది. మరోవైపు పాకిస్థాన్ ఆడిన మూడు మ్యాచ్ ల్లో రెండు గెలిచింది. రెండు జట్లు ఆదివారం (ఫిబ్రవరి 1) బులవాయోలోని క్వీన్ స్పోర్ట్స్ క్లబ్‌లో మ్యాచ్ ఆడాల్సి ఉంది. సెమీస్ కు చేరాలంటే ఈ రెండు జట్లకు చివరి మ్యాచ్ చాలా కీలకం. ఇండియా గెలిస్తే నేరుగా సెమీ-ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. ఒకవేళ టీమిండియా ఓడిపోయినా సెమీస్ కు వెళ్లే అవకాశం ఉంటుంది. అయితే భారీగా ఓడిపోకుండా చూసుకోవాలి. ఓవరాల్ గా ఈ మ్యాచ్ లో ఇండియాకు ఎక్కువగా అవకాశాలు ఉన్నాయి. సెమీ ఫైనల్లో పాకిస్థాన్ ను ఇంటికి పంపే సువర్ణావకాశం టీమిండియాకు ముందు ఉంది. ఇటీవలే జరిగిన ఆసియా కప్ ఫైనల్లో ఇండియాను పాకిస్థాన్ ఓడించింది. ఆ పరాజయానికి ప్రతీకారం తీసుకునే అవకాశం టీమిండియాకు ఇప్పుడు వచ్చింది.ఇప్పటివరకు టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా వస్తున్న భారత జట్టు స్థాయికి తగ్గట్టుగా ఆడితే పాకిస్థాన్ పై గెలవడం అంత కష్టం కాదు. వైభవ్ సూర్యవంశీ, విహాన్ మల్హోత్రా, ఆయుష్ మాత్రే, అభిజ్ఞాన్ కుండు చెలరేగాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. పాకిస్థాన్ లాంటి జట్టును ఇంటికి పంపించి సెమీస్ కు చేరుకుంటే అంతకంటే కిక్ ఏం ఉంటుంది అని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

# టీ20 ప్రపంచకప్‌కు ముందు ఆస్ట్రేలియాకు బిగ్ షాక్... స్టార్ పేసర్ ఔట్!

**గాయం కారణంగా టీ20 ప్రపంచకప్‌కు దూరమైన ప్యాట్ కమిన్స్**
**తుది జట్టులో కమిన్స్ స్థానంలో బెన్ డ్వార్షుయిస్‌కు చోటు**
**గాయం నుంచి కోలుకుని తిరిగి జట్టులోకి వచ్చిన జోష్ హేజిల్‌వుడ్**
**మిచెల్ మార్ష్ కెప్టెన్సీలో బరిలోకి దిగనున్న ఆస్ట్రేలియా**




**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిబ్రవరి 7న ప్రారంభం కానున్న టీ20 ప్రపంచకప్‌కు ముందు ఆస్ట్రేలియా జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జట్టు స్టార్ పేస్ బౌలర్, కీలక ఆటగాడు ప్యాట్ కమిన్స్ గాయం కారణంగా మెగా టోర్నీకి పూర్తిగా దూరమయ్యాడు. ఈ మేరకు ప్రావిజనల్ జట్టులో రెండు మార్పులు చేసి, 15 మందితో కూడిన తుది జట్టును క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ఇవాళ ప్రకటించింది. గతేడాది జూలైలో వెన్ను గాయానికి గురైన కమిన్స్, ఇప్పటికీ పూర్తిగా కోలుకోలేదు. దీంతో అతడిని టోర్నీ నుంచి తప్పించాలని సీఏ నిర్ణయించింది. కమిన్స్ స్థానంలో మరో పేసర్ బెన్ డ్వార్షుయిస్‌ను జట్టులోకి తీసుకున్నారు. అదే సమయంలో టాప్ ఆర్డర్ బ్యాటర్ మ్యాథ్యూ షార్ట్‌ను కూడా తుది జట్టు నుంచి తొలగించారు.అయితే, గాయాల కారణంగా యాషెస్ సిరీస్‌కు దూరమైన మరో ప్రధాన పేసర్ జోష్ హాజిల్‌వుడ్ పూర్తి ఫిట్‌నెస్ సాధించి జట్టులోకి తిరిగి రావడం ఆసీస్‌కు ఊరటనిచ్చే అంశం. పాకిస్థాన్ పర్యటనకు దూరమైన టిమ్ డేవిడ్ కూడా తుది జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఈ జట్టుకు మిచెల్ మార్ష్ సారథ్యం వహించనున్నాడు. హేజిల్‌వుడ్, నాథన్ ఎల్లిస్, జేవియర్ బార్ట్‌లెట్‌లతో పేస్ విభాగం బలంగానే ఉంది. శ్రీలంక, భారత్‌లో జరగనున్న ఈ టోర్నీలో స్పిన్‌కు ప్రాధాన్యం ఇస్తూ ఆడమ్ జంపా, మాథ్యూ కునెమన్‌లను జట్టులో చేర్చారు. ఆస్ట్రేలియా గ్రూప్-బీలో ఉండగా, ఫిబ్రవరి 11న కొలంబోలో ఐర్లాండ్‌తో తమ తొలి మ్యాచ్ ఆడనుంది.



నైరా బెనర్జీ యొక్క అద్భుతమైన రెడ్ చీర త్రోబ్యాక్

# #బార్డర్ 2.. 'దురంధర్'ని టచ్ చేయడం అసాధ్యం



బాలీవుడ్ మీడియా ఒక్కోసారి ఊదరగొట్టేస్తుంటుంది. ముఖ్యంగా ఉత్తరాది బాక్సాఫీస్ వద్ద సౌత్ సినిమా డామినేషన్ ని హిందీ మీడియా తట్టుకోలేకపోతోంది. పర్యవసానంగా బాలీవుడ్ రైజింగ్ ని చూడాలని కసిగా వేచి చూస్తోంది. కరోనా క్రైసిస్ తర్వాత ఉత్తరాదిన దక్షిణాది సినిమా హవా కొనసాగడం... హిందీ పరిశ్రమ డిజాస్టర్లతో నీరసపడిపోవడంతో ఇంతకాలం వేచి చూసింది. షారూఖ్ పఠాన్- జవాన్ కొంతవరకూ ఊరట. స్త్రీ 2, చావా లాంటి సినిమాలు ఆదుకున్నాయి. ఇప్పుడు రణ్ వీర్ సింగ్ -దురంధర్- హిందీ పరిశ్రమ గౌరవాన్ని కాపాడింది. -దురంధర్- చిత్రం 50రోజుల్లో 800కోట్ల నెట్... వసూళ్లను సాధించడం నిజంగా ఒక రికార్డ్. అయితే దురంధర్ వసూళ్ల విషయంలో కొన్ని హిందీ మీడియాలు చాలా హైప్ క్రియేట్ చేయడానికి ప్రయత్నించాయన్నది వాస్తవం. ఒరిజినల్ లెక్కలకు మీడియా చూపించిన లెక్కలకు కచ్ఛితంగా తేడా ఉంది. అయినా దురంధర్ క్లీన్ బ్లాక్ బస్టర్ గా రికార్డులకెక్కిందనడంలో సందేహం లేదు.అయితే ఇప్పుడు సన్నీడియోల్ లాంటి సీనియర్ హీరో నటించిన బార్డర్ 2 చిత్రం విషయంలోను బాలీవుడ్ మీడియా అత్యుత్సాహం చూస్తుంటే ఇది చాలా కామెడీగా అనిపిస్తోంది. బార్డర్ 2 చిత్రం 6 రోజుల్లో 213 కోట్ల నెట్ వసూలు చేసింది. అయితే బార్డర్ 2 దురంధర్ రికార్డులను కొట్టేస్తుంది! అంటూ ఒక సెక్షన్ మీడియా ప్రచారం చేస్తోంది. నిజానికి బార్డర్ 2 కి అంత సీన్ లేదని కొందరు క్రిటిక్స్ విశ్లేషించారు.బార్డర్ 2 చిత్రం 50 రోజులు ఆడినా 800కోట్లు తేవడం కష్టం.. ఇప్పటికి బాగా ఆడుతున్నా కానీ, దురంధర్ రన్ వేరే.. దురంధర్ చిత్రానికి సంక్రాంతి సెలవులు బాగా కలిసొచ్చాయి... సౌత్ లో కూడా బాగా ఆడింది.. ఆ పరిస్థితి సన్నీడియోల్ బార్డర్2 చిత్రానికి లేదు. దురంధర్ ఒరిజినల్ కథతో.. బయోపిక్ కేటగిరీలో వచ్చిన సినిమా కాబట్టి అన్ స్టాపబుల్ గా దూసుకెళ్లింది.. కానీ బార్డర్ 2 సీక్వెల్ సినిమా... ఇప్పటికే చూసేసిన ఎమోషన్స్ రొటీన్ వార్ డ్రామా కాబట్టి దీనికి అంత సీన్ లేదని విశ్లేషిస్తున్నారు.

నిజానికి బార్డర్ 2 చిత్రానికి పండగ సెలవులు ఏవీ కలిసి రాలేదు. కేవలం వీకెండ్స్ పై మాత్రమే ఆధారపడి ఫుల్ రన్ ని సాగించాల్సి ఉంటుంది. అందువల్ల దురంధర్ రేంజులో వసూలు చేయడం సాధ్యపడదు. అలాగే బార్డర్ 2 కి రెండో వారంలో అసలైన టెస్ట్ మొదలవుతుంది. ఇంకా నాలుగైదు వారాలు భారీగా వసూలు చేయాల్సి ఉంటుంది. కానీ ఈ దేశభక్తి సినిమా దురంధర్ స్థాయికి వెళుతుందని ట్రేడ్ భావించడం లేదు. అయితే బార్డర్ 2 సన్నీడియోల్ కెరీర్ బెస్ట్ హిట్ చిత్రాలలో ఒకటిగా నిలుస్తుందనడంలో సందేహం లేదు. ఈ చిత్రంలో నటించిన వరుణ్ ధావన్, అహాన్ శెట్టి లాంటి యువహీరోలకు ఒక మంచి హిట్టు దక్కినట్టయిం ది. ఇకపై యంగ్ హీరో లు సోలో హిట్లతో నిరూపించాల్సి ఉంటుంది.



షామా సికిందర్ అద్భుతంగా కనిపిస్తున్నాడు!

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com